# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్


■ శుక్రవారం । 21 నవంబర్ 2025 । ■ 14 పేజీలు




14

## సోయా.. జర చూపరా దయ

■ కొనుగోళ్లలో సడలింపులివ్వాలి ■ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కోరిన సీఎం, బీజేపీ ఎమ్మెల్యేలు



# వడివడిగా... ఎన్నికల వైపు

■ పంచాయతీ పోరుకు కసరత్తు షురూ..
■ 'స్థానికం'పై మళ్లీ సర్కార్ ఫోకస్
■ జీపీ ఎన్నికలకు మరోసారి ఏర్పాట్లు
■ ఓటరు తుది జాబితాకు షెడ్యూల్ విడుదల
■ నేడు అభ్యంతరాల పరిష్కారం
■ 23న ఓటర్ల జాబితా, కేంద్రాల ప్రకటన
■ ఈనెలాఖరులోగా ఎన్నికల షెడ్యూల్
■ అంతా సిద్ధం చేస్తున్న యంత్రాంగం
■ సర్పంచ్ రాజకీయ ప్రస్థానంపై దృష్టి సారించిన ఆశావహులు

విడతలు 11 లో

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అడుగులు చకచకా పడుతున్నాయి. తొలుత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయానికి రాగా ఎన్నికల సంఘం ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఈనెల 23న జిల్లాలో ఓటర్ల తుది జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల వివరాలను విడుదల చేయనున్నారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. నవంబర్ 26 లేదా 27వ తేదీన పంచాయతీ ఎన్నికల నగారా మోగనుందని తెలుస్తోంది. మొత్తం మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ ఎన్నికలను చాలా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ స్పష్టం చేసింది.

### సందడే.. సందడి..!

గ్రామ పంచాయతీ ఎన్నికలపై రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల కానుండడంతో స్థానిక రాజకీయ నాయకులు, ప్రజాసేవపై ఆసక్తి ఉన్న యువత ప్రత్యేక దృష్టి సారించింది.. గ్రామాల్లో తమ ప్రాబల్యం పెంచుకునేలా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రత ఎన్నికల సంఘం ప్రకటించడమే తరువాయి.. రంగంలోకి దూకేందుకు స్థానిక నాయకులు, ప్రధానంగా యువత ఎన్నికల బరిలోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో మళ్లీ గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది.



7

## జగిత్యాల-మంచిర్యాల హైవేకు లైన్ క్లియర్

■ రూ.2550 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
■ నేషనల్ హైవేకు ఇప్పటికే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల నుంచి అనుమతులు మంజూరు
■ నాలుగో ప్యాకేజీ కింద రహదారి విస్తరణ
■ 35.39కి.మీ మేర బ్రౌన్ ఫీల్డ్‌కు గ్రీన్ సిగ్నల్

జగిత్యాల-మంచిర్యాల నేషనల్ హైవేకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఇప్పటికే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల నుంచి అనుమతులు రాగా, తాజాగా రహదారి నిర్మాణానికి అవరమైన రూ. 2550 కోట్లు కేటాయించింది. దీంతో ఇంతకాలం సందిగ్ధంలో ఉన్న జాతీయ రహదారి 63కు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ లభించగా, త్వరలో కాంట్రాక్టింగ్ పూర్తి చేసుకొని, పనులు ప్రారంభం కానున్నాయి.

### గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి కృషి

■ లక్ష్యాన్ని నిర్ధారించుకొని యువత ఉన్నతంగా ఎదగాలి
■ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
■ నేనూ ఇక్కడే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను..
■ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

14



### వైద్యుడి నిర్లక్ష్యానికి బాలుడు బలి

■ కుటుంబ సభ్యులు, బంధువుల ఆగ్రహం
■ ఆస్పత్రి అద్దాలు ధ్వంసం..
■ న్యాయం చేయలాంటూ ఆందోళన
■ ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్న పోలీసులు
■ మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఘటన



12

## 80 క్వింటాళ్ల రేషన్ బియ్యం గోల్ మాల్

■ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి మండలంలో ఘటన
■ రెవెన్యూ అధికారుల తనిఖీల్లో బయటపడ్డ డీలర్ బాగోతం..

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణీ మండల కేంద్రంలోని చౌకధరల దుకాణంలో 80 క్వింటాళ్ల రేషన్ బియ్యం గోల్ మాల్ అయ్యాయి. 2413001 నెంబర్‌గల రేషన్ షాపులో డీలర్ రత్నకిశోర్ లబ్దిదారులకు రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు సోదాలు నిర్వహించారు. 80 క్వింటాళ్ల బియ్యం కాజేసినట్లు గుర్తించారు.




## జిల్లాలో ఆయిల్ పామ్ సాగు
# విస్తీర్ణాన్ని పెంపొందించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలి
- ఉద్యానవన విస్తరణ అధికారులు, ప్రాథమిక సహకార సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ సీమీక్ష
- కలెక్టర్‌ను సన్మానించిన అధికారుల బృందం

**మంచిర్యాల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి అనిత, జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా సహకార అధికారి తో కలిసి డివిజనల్ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యానవన విస్తరణ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ పంట సాగుతో కలిగే లబ్ధిపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 438 ఎకరాలలో సాగు జరుగుతుందని, సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేసి మిగతా లక్ష్యాన్ని సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో ఆదాయం అధికంగా ఉంటుందని, ఈ విషయంపై రైతులకు వివరించి పంట సాగు చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి వరి ధాన్యం, పత్తి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో రైతుల వద్ద నుండి తేమ శాతం, ఇతర నిబంధనల ప్రకారం నాణ్యమైన పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేలా అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల సమ



న్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని, గోనె సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు ఇతర సదుపాయాలను సమకూర్చి కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు వరి ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన తరువాత వారికి టోకెన్లు జారీ చేయాలని తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక చర్యలను చేపడుతుందని, ఈ క్రమంలో రైతుల వద్ద నుండి పంట ఉత్పత్తులను సకాలంలో కొనుగోలు చేసి చెల్లింపులు చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి 6వ జల పురస్కారాలలో భాగంగా మంచిర్యాల జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చినందుకుగాను జిల్లా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



# సీనియర్ సిటిజన్‌లను ప్రతీ ఒక్కరు గౌరవించాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** సీనియర్ సిటిజన్లకు సముచిత గౌరవం లభించినప్పుడే సమాజం మరింత ప్రగతి సాధిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వం సీనియర్ సిటిజన్ యాక్ట్ ను తీసుకురావడం జరిగిందని, ఈ చట్టంపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వయోవృద్ధులు తమ పూర్తి ఆస్తిని పిల్లలకు ఇవ్వకుండా కొంత భాగాన్ని తమ భద్రత కోసం ఉంచుకోవాలని సూచించారు. పిల్లలు సంరక్షణ చేయని పక్షంలో కలెక్టర్ లేదా ఆర్డీఓకు దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి తిరిగి ఆస్తిని పొందే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో వయోవృద్ధులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. దస్నాపూర్‌లో వయోవృద్ధుల కోసం ప్రత్యేక భవనం నిర్మించి ఇంచార్జి మంత్రిచే ప్రారంభించుకున్నామని, అక్కడ డే కేర్ కేంద్రం కూడా త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్



తెలిపారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సంరక్షణ టోల్ ఫ్రీ నంబర్ పోస్టర్‌ను ఆవిష్కరించి, పలువురు వయోవృద్ధులను మెమెంటోలతో సన్మానించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించి వైద్యులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, వయోవృద్ధుల సమైక్య సభ్యులు దేవిదాస్, లక్ష్మారెడ్డి, అధికారులు, వైద్యులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.



# ఐడియా అదిరింది గురూ..!

**ముథోల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** ఉన్నది తక్కువ భూమి..! ఈ మధ్య టైంకు ట్రాక్టర్ రాకపాయె..! చేసేదేమీ లేక నలుగురు స్నేహితులు కలిసి ఎండిన వరి కుప్పల పై వరి గింజలను నూర్పిడి చేసిన విధానం అందరిని ఆశ్చర్యపరిచింది. వివరాల్లోకి వెళితే నిర్మల్ జిల్లా ముథోల్‌లోని కోలిగల్లీ కాలనీకి చెందిన పోతన్న తనకున్న 20 గుంటల స్థలంలో వరి సాగు చేశారు. కోతకు రావడంతో పొలాన్ని కోయించి కుప్పవేశారు. తొలుత ట్రాక్టర్‌తో నూర్పిడి చేయించే ప్రయత్నం చేసినా.. చిన్న విస్తీర్ణం కావడంతో కుదరలేదు. దీంతో పోతన్న స్నేహితులు ముందుకొచ్చి తమ బైక్‌లతో బంతి కొట్టి ధాన్యాన్ని నూర్పిడి చేశారు.

## 80 క్వింటాళ్ల రేషన్
# బియ్యం గోల్ మాల్

**ఆసిఫాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణీ మండల కేంద్రంలోని చౌకధరల దుకాణంలో 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గోల్ మాల్ అయ్యాయి. 2413001 నెంబర్ గల రేషన్ షాపులో ప్రభుత్వ డీలర్ రత్నకిశోర్ లబ్దిదారులకు రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు షాపులో సోదాలు నిర్వహించారు. 80 క్వింటాళ్ల రేషన్ బియ్యం కాజేసినట్లు గుర్తించారు. షాపులో మొత్తం 177 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండగా ఈ పాస్ ద్వారా 97 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. తనిఖీ సమయంలో షాపులో 80 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ ఉండాల్సి ఉండగా. లేకపోవడంతో సదరు డీలర్ రత్నకిశోర్ పై 6-ఏ కింద కేసు నమోదు చేసి జీసీసీకీ సరెండర్ చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.



# స్థానిక సంస్థ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని

**నిర్మల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికల సమాయత్తాలపై గురువారం ఆమె హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాణి కుముదిని మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి శాఖ పెద్దపీట వేశాలన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, రిజర్వేషన్ల కేటాయింపు, శాంతిభద్రతల బందోబస్తు వంటి అంశాలపై అధికారులు ఒకటికి రెండుసార్లు పరిశీలనలు చేయాల్సిన అవసరాన్ని ఆమె గుర్తుచేశారు. ఎన్నికలను మూడు విడతలలో నిర్వహించే దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు పని చేయను



న్నట్లు తెలిపారు. ఎన్నికల పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితాను వెంటనే పంపించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు యథావిధిగా కొనసాగుతున్నాయని, అధికారులు ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తూ ఎటువంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, జెడ్పి సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, పంచాయతీ రాజ్, పోలీసు, రెవెన్యూ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ

**కాసిపేట, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** కాసిపేట మండల కేంద్రంలో గురువారం వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న చెరువులలో ప్రభుత్వం అందించిన మత్సకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ చేశారు. గురువారం కాసిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అధికారుల చేతుల మీదుగా మత్స్యకారులకు చేప పిల్లలు అందించారు. కార్యక్రమంలో ముత్యంపల్లి కార్యదర్శి మేఘన, కోమటిచేను కార్యదర్శి ఉదయ్, ధర్మారావుపేట కార్యదర్శి అన్నపూర్ణ, రొట్టెపల్లి కార్యదర్శి సౌందర్య, ఫిషరి అస్సిటెంట్ నీలా, ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోలేటి స్వామి, సిరాజ్ ఖాన్, జాడి శంకర్, షారూఖ్, తోడేటి ప్రశాంత్, అక్కెపల్లి రాజేష్, మెరుగు శ్రీనివాస్, బాకీ నరేష్, బొగ్గుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.






# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

■ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు ■ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**
ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండలం తాళ్లపల్లి సమీపంలో గల గోదావరి నది తీరం వద్ద సాండ్ రీచ్ ను నస్పూర్ మండల తహసీల్దార్ సంతోష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వినియోగదారుల సౌకర్యార్థం ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న వినియోగదారులకు రవాణా చేస్తుందని తెలిపారు. నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ప్రభుత్వ అభివృద్ధి పనులకు రీచ్‌ల ద్వారా ఇసుకను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక రీచ్ కు రాకపోకల కొరకు అవసరమైన తాత్కాలిక దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్ల సమీపంలోని ఇసుక రీచ్ ప్రాంతాన్ని హాజీపూర్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండేతో కలిసి సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని గుడిపేట, నంనూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వం రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, ఈ క్రమంలో రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా కేంద్రాల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల సౌకర్యం త్రాగునీరు, నీడ మౌలిక వసతులు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు సమకూర్చడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వంద శాతం ఇంటి పన్ను వసూళ్లు చేయాలి

**కాసిపేట, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**
ఈ నెల 25వ తేదీలోపు గ్రామ పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేసి పంచాయతీ ఖాతాలో జమ చేయాలని బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ కుమార్ ఆదేశించారు. గురువారం కాసిపేట మండలం కాసిపేట గ్రామ పంచాయతీని ఆయన పరిశీలించారు. హాజరు యాప్ తనిఖీల్లో భాగంగా ఆయన కాసిపేట గ్రామ పంచాయతీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిరంతరం సక్రమంగా జరగాలని, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ నిర్వహించి, సెగ్రిగేషన్ షెడ్‌లో తడి చెత్తను, పొడి చెత్త నుండి వేరు చేసి నాణ్యమైన సేంద్రియ ఎరువు తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. అనంతరం ఆయన వైకుంఠధామాన్ని సందర్శించి, అక్కడ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్ వద్ద ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు.



## అత్యవసర వాహనాలకు ఆటంకం కలిగించొద్దు



**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**
జాతీయ రహదారిపై అత్యవసర సేవల వాహనాలు ప్రయాణిస్తుంటాయని, వాటిని అడ్డుకోవడం చట్టరీత్యా నేరమని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. యువకులు కేసుల భారిన పడకుండా నిబంధనలు పాటించాలన్నారు. అంబులెన్స్, అగ్నిమాపక, వాహనాలు ఆస్పత్రులకు వెళ్లేవారికి అసౌకర్యం కలిగే చర్యలు చేయవద్దన్నారు. యువత విపరీతమైన దోరణితో వ్యవహరించడంతో కేసులు నమోదు అవుతున్నాయని, దీంతో ఉద్యోగ అవకాశాలను కూడా కోల్పోయే అవకాశముందన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు పాటుపడాలి



**మంచిర్యాల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**
గురువారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో వారం రోజుల నుండి వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అదేవిధంగా వివిధ పోటీలు నిర్వహించడం జరిగింది. పోటీలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు యువతీ యువకులకు ముగింపు వేడుకల సందర్భంగా సర్టిఫికెట్స్ మరియు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శంకర్, జిల్లా జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ సంపత్ పాల్గొన్నారు. డాక్టర్ శంకర్ ప్రసంగిస్తూ గ్రంథాలయాల అభివృద్ధికి ఎంతో మంది ఎన్నో రకాలుగా సహాయం చేశారని ఆ సహాయ సహకారాల వల్లనే ఈరోజు గ్రంథాలయం నుండి పాఠకులు ఎంతో మంది ఉన్నతమైన ఉద్యోగాలలో స్థిరపడుతున్నారని, ఇదే విధమైన స్ఫూర్తితో గ్రంథాలయ సిబ్బంది ఇంకా పనిచేయాలని అన్నారు. సాధించిన వారు గ్రంథాలయాలకు వారికి తోచిన విధంగా సహాయం చేయాలని, గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలని అన్నారు, పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎన్నో కార్యక్రమాలలో మన జిల్లాలో ప్రత్యేకమైన చర్యలు తీసుకోవడం జరిగిందని తద్వారా వందలాది మంది ఉద్యోగాలు సాధించి స్థిరపడ్డారని అదేవిధంగా పాఠకులు కూడా మంచి ఉద్యోగాల్లో స్థిరపడడానికి అవకాశం ఉన్నదని, అంత గొప్ప పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నాయని అన్నారు. మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాల అభివృద్ధికి మరియు పాఠకుల శ్రేయస్సు కొరకు అన్ని రకాల ఏర్పాట్లు గ్రంథాలయంలో ఉన్నాయని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ అడ్డిచెర్ల సాగర్, జిల్లా గ్రంథాలయ సిబ్బంది క్రితిన్ కుమార్, మురళి, రామారావు, సంపత్ కుమార్, చక్రవర్తి, సుమన్, బోనగిరి రాజిరెడ్డి, నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.



## అవార్డులు బాధ్యతలు పెంచుతాయి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**
ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా "జల సంచయ్-జన భాగీదారి" అవార్డు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు గురువారం కలెక్టరేట్ వద్ద అధికారులు ఘన స్వాగతం పలికారు. జాతీయ స్థాయిలో దక్షిణాది విభాగంలో నిర్మల్ జిల్లా రెండవ స్థానంలో నిలిచి కోటి రూపాయల రివార్డు పొందడం గర్వకారణమని కలెక్టర్ తెలిపారు. ఈ విజయంలో అధికారుల కృషి, ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించేందుకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో పాటు అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు,సిబ్బంది కలెక్టర్‌ను కలిసిపూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేయగా, కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది.

## కలెక్టర్ కృషి అభినందనీయం

**మంచిర్యాల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**
కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి 6వ జల పురస్కారాలలో భాగంగా మంచిర్యాల జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఎపిఓలు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయి పురస్కారాలలో మొదటి 3 స్థానాలలో మంచిర్యాల జిల్లా స్థానం సంపాదించి అవార్డుతో పాటు రూ. 2కోట్ల నగదు పురస్కారాన్ని పొందింది.



# శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్

**ఆదిలాబాద్ ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్**




**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**
ప్రజల రక్షణ, సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్‌లను నిర్వహించడం జరుగుతుందని ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్ తెలిపారు. ఉదయం ఐదు గంటల నుండి 70 మంది సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్‌ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సరైన ధ్రువపత్రాలు లేనటువంటి 60 ద్విచక్ర వాహనాలు, 10 ఆటోలు, రెండు మ్యాక్స్ వాహనాలను తాత్కాలికంగా స్వాధీనం చేసుకోవడం జరిగింది. చట్ట విరుద్ధంగా అక్రమ మద్యం అమ్ముతున్నటువంటి మూడు బెల్ట్ షాపులను జప్తు చేయడం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రజలతో మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండాలని సూచించారు.ప్రజలు యువత వాహనాలలో ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేస్తూ వాటి ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ఉండాలని ఎలాంటి గృహహింస చర్యలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. రాత్రి సమయాలలో అనవసరంగా తిరగరాదని, ఈవిటీజింగ్, మహిళలను వేధించడం లాంటివి నిర్వహించకూడదని, గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సోషల్ మీడియా పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సిఐలు కె ఫణిధర్, కె నాగరాజు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లో టీ మురళి, ఎన్ చంద్రశేఖర్, రూరల్ ఎస్సై విష్ణువర్ధన్, ఎస్ఐలు డి.రాధిక, జీవన్ రెడ్డి, రాకేష్ సిబ్బంది పాల్గొన్నారు.




## రిమ్స్ ఆస్పత్రిలో అన్ని రకాల

# వైద్య సేవలు అందేలా చర్యలు

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి శస్త్రచికత్సల కోసం హైదరాబాద్‌కు తరలింపు
- గుండె సంబంధింత వైద్య శిబిరం సందర్శన..
- 150 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు





**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా రిమ్స్ నుంచే అన్ని అవసరమైన వైద్య సేవలు అందించేలా సమర్థమైన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో అపోలో, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్నారుల ఉచిత గుండె జబ్బుల వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. రిమ్స్‌లోని డీఈఐసి కేంద్రంలో హైదరాబాద్ అపోలో కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పీడియాట్రిక్ కార్డియాలజీ శిబిరానికి ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 150 మంది చిన్నారులు హాజరయ్యారు. వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సల నిమిత్తం హైదరాబాద్‌కు రావాలని సూచించారు. ఒక చిన్నారి తల్లి హైదరాబాద్‌లో పరీక్షలు చేయించుకుంటున్నట్లు తెలుసుకున్న కలెక్టర్, రిమ్స్‌లోనే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఇక్కడే వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించేలా రిమ్స్‌లోనే వైద్య చికిత్సలు అందించాలని అన్నారు. వైద్య పరీక్షలు, మందులు, స్కానింగ్, 2డీ ఈకో వంటి సేవలు రిమ్స్‌లోనే అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పేదలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించేందుకు అపోలో ఆసుపత్రి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. మందులు, స్కానింగ్ తదితర పరీక్షల కోసం పేదలపై భారం తగ్గేలా ప్రణాళికలు రూపొందించి, రవాణా ఖర్చులు మాత్రమే అయ్యే విధంగా హైదరాబాద్‌కు పంపేలా వ్యవస్థను రూపొందించాలని రిమ్స్ డైరెక్టర్‌కు సూచించారు. అవసరమైతే ఆసుపత్రి యాజమాన్యానికి లేఖ రాసి, రిమ్స్‌లోనే పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, వైద్యులు వై.సి. శ్రీనివాస్, సమీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఘన స్వాగతం

## సమష్టి కృషితోనే అవార్డు - నిర్మల్ జిల్లా రెండవ స్థానంలో నిలవడం గర్వకారణం



**నిర్మల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 18వ తేదీన జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక "జల సంచయ్-జన భాగీదారి" అవార్డును స్వీకరించి గురువారం కలెక్టరేట్‌కు వచ్చిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కార్యాలయం ప్రధాన గేటు వద్ద అధికారులు పూలమాలలు, బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. పలువురు అధికారులు కలెక్టర్‌కు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి జల అవార్డుల్లో భాగంగా దక్షిణాది రాష్ట్రాల విభాగంలో నిర్మల్ జిల్లా రెండవ స్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు. జిల్లాకు కోటి రూపాయల రివార్డు లభించడం విశేషమని తెలిపారు. అధికారుల సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పని చేసి, జిల్లాకు మరిన్ని ప్రతిష్టాత్మక అవార్డులు సాధించేందుకు కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. జిల్లాకు ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో పాటు అదనపు కలెక్టర్లు ఫైజాన్



అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## ఉత్తమ పీఏసీఎస్ చైర్మన్

# అవార్డు అందుకున్న రవి

**జన్నారం, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పొన్కల్ పిఎసిఎస్ చైర్మన్గా విధులు నిర్వహిస్తున్న అల్లం రవి, ఉత్తమ పిఎసిఎస్ చైర్మన్‌గా అవార్డు దక్కించుకున్నారు. 72వ ఆల్ ఇండియా కోపరేటివ్ సహకార వారోత్సవాల్లో భాగంగా హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ పిఎసిఎస్ అవార్డును ప్రిన్సిపల్ డిసిబిసి చైర్మన్ బుక్య వెంకన్న, డిసిఓ సంజీవరెడ్డి ఎండి అన్నపూర్ణ చేతుల మీదుగా అవార్డును తీసుకున్నారు. సందర్భంగా అల్లం రవి మాట్లాడుతూ.. రైతులకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ ఎరువులు విత్తనాలు అందించడంలో రైతులకు సహకరించినందుకు ఈ అవార్డు దక్కిందన్నారు. అవార్డుతో రైతులకు మరింత మేలు చేయటానికి తనపై బాధ్యత పెరిగిందన్నారు. సీఈఓ రాజన్న అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి గాయాలు

**జన్నారం, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పైడిపల్లి హనుమాన్ టెంపుల్ మూలమలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రంలోని వీర్లగుట్ట శ్రీ కేతేశ్వర కంకాలమ్మ ఆలయ పూజారి రేగుంట భూమయ్యకు ముఖంపై కాళ్లకు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో, 108 సిబ్బంది వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని గాయాలపాలైన రేగుంట భూమయ్యను వాహనంలో తీసుకొని చికిత్స కోసం లక్సెట్టిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం భూమయ్య ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

## చలో ఉట్నూర్ పోస్టర్ల ఆవిష్కరణ

**బజార్‌హత్నూర్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

చట్ట బద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షులు ఉయిక సుదర్శన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఆదివాసుల ధర్మ యుద్ధం, చలో ఉట్నూర్ పోస్టర్‌లను గురువారం ఆదివాసీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈనెల 23న ఉట్నూర్ లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఉట్నూర్ లో జరిగే బహిరంగ సభకి మండల ఆదివాసులు పెద్దమొత్తంలో తరలిరావాలని కోరారు. వారితో కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు దయానంద్, చందు, గంగాధర్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే హరీష్ బాబు

**ఆసిఫాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

గ్రంథాయాలు విజ్ఞాన నిలయాలని, పాఠకులు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవస రమైన విజ్ఞానం గ్రంథాయాలలో లభిస్తుందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ శాఖలో గురువారం నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీష్ బాబుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాల యాలు విజ్ఞాన భాండాగారా లని మన అందరికి అవసరమైన విజ్ఞానం లభిస్తుందని తెలి పారు. గ్రంథాలయాలలో పాఠకుల కోసం, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు చరిత్రకు సంబందించిన పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉన్నాయని తెలిపా రు. పోటీ పరీక్షల అభ్యర్థులు గ్రంథాలయాలను సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా



అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకుల కోసం మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. పాఠకులు, యువత గ్రంథాల యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సరిత తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

## బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ - మందమర్రిలో చాయ్ పేచర్చ కార్యక్రమం



**మందమర్రి, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై బీసీల ఆధ్వర్యంలో యుద్ధం నిర్వహిస్తామని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర శ్రీనివాస్ స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని సింగరేణి హై స్కూల్ గ్రౌండ్‌లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన చాయ్ పేచర్చ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ అనుసరించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి రాజ్యాంగ సవరణ చేసి 42% రిజర్వేషన్లకు చటబద్ధత కల్పించాలని కోరారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ప్పటి నుండి నేటి వరకు 130 సార్లు రాజ్యాంగ సవరణలు చేశారు. ఏఉద్యమం లేకుండానే అగ్రకులాలకు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 103 ను ఐదు రోజుల్లో సవరణ చేసి 10శాతం ఈడబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర ప్రభుత్వం 40 సంవత్సరాలుగా బీసీలకు విద్యా ఉద్యోగ స్థానిక సంస్థలు చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమాలు చేస్తున్న బీసీలకు ప్రజాస్వామ్య బద్ధంగా వాటా ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. ఇప్పటి కైనా కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్ లను గుర్తించి 42 శాతం రిజర్వేషన్ల పై రాజ్యాంగ సవరణ చేసి కేంద్ర ప్రభుత్వం బీసీల పక్షాన నిలబడాలన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో కార్మిక నాయకుడు సలేంద్ర సత్యనారాయణ, మైనార్టీ నాయకులు ఎండి ఎండి అబ్బాస్, సగర సంఘం జిల్లా అధ్యక్షులు బర్ల సదానందం, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు చిలగాని సుదర్శన్, బిసి నాయకులు ఒజ్జ సాగర్ బాబు, దూడపాక రాజేందర్, శనిగారపు జనార్ధన్, బిసి సమాజ్ నాయకులు వెన్నంపల్లి రవీందర్, అంకం సాగర్, శీలం మహేందర్, చింతల పోషం, పొన్నం హరీష్, రామసాని శేఖర్, కంది తిరుపతి, నస్పూరి తిరుపతి, పిల్లి మల్లేష్, బర్ల శేఖర్, బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.




# మత్స్య సహకార సంఘాల్లో ముదిరాజులకు సభ్యత్వం కల్పించాలి

## సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య

**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో ఉన్న కొత్త పాత చెరువులలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన 18 ఏళు నిండిన యువకులకు బేషరత్‌గా మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వాలు కల్పించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్, అఖిల భారత కోలీ సమాజ్ జాతీయ కార్యవర్గ సభ్యులు, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బొజ్జ నారాయణ ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో ఈనెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిస్తూ ఇందుకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘాల నేతలు మాట్లాడుతూ తెలంగాణ లోని మిగతా జిల్లాలతో పోలిస్తే తమ జిల్లాల్లో ముదిరాజులకు మత్స్య సహకార సంఘాల్లో సరైన సభ్యత్వాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దపెద్ద చెరువులు ప్రాజెక్టులు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల తమకు సభ్యత్వాలు లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 6 ప్రకారం ప్రతి ముదిరాజులకు చెరువులలో సభ్యత్వం కల్పించాలని మత్స్యకారుల సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేపల చెరువుల సొసైటీల ఏర్పాటుపై ఆయా గ్రామాల్లో విడీసీలు పెత్తనం చేయడాన్ని ఎంత మాత్రం సహించేది లేదని దీనిపై జిల్లా అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి మత్స్యకార సంఘాల నాయకులు భారీగా కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ధార్ష శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి భగవాండ్లు, జిల్లా కార్యదర్శి ఈగల పొచ్చన్న, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యాన్ని చాటిన యువకుడు

## అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు



**బోథ్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

బోథ్ మండలంలోని దన్నూరు (బి) గ్రామానికి చెందిన దూదేకుల కులస్తుడు షేక్ అలీ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేసి మతసామరస్యాని చాటుకున్నారు. గత ఆరు సంవత్సరాలుగా అన్నదానం చేస్తూ మతసామారస్యానికి ప్రతీకగా అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఈ సందర్భంగా షేక్ అలీ మాట్లాడుతూ రంజాన్ పండుగను ఎంత పవిత్రంగా కఠోర ఉపవాసాలతో జరుపుకుంటామో అలాగే అంతే కఠోర దీక్షతో అయ్యప్ప స్వాములు 41 రోజుల పాటు కఠిన నియమాలతో ఉంటారని పేర్కొన్నారు. ఎటువంటి భేదభావ్యం లేకుండా అన్ని పండుగలను కుల,మతాలకతీతంగా ఐక్యమత్యంతో కలిసి జరుపుకోవాలని కోరారు. అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం తనకు ఎంతో ఆత్మ సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. ఆ స్వామి ఆశీస్సులతో సమాజం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. గురుస్వామి బద్దం రమణారెడ్డి, అరుణ్, సందీప్, ప్రవీణ్, విజయ్, జైపాల్, అమరేందర్, సంతోష్, రమేష్, భోజన్న, స్నేహిత్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ ప్రకటించిన తర్వాతే

# స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



**ఆసిఫాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

బీసీ రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రూపునర్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాస్తా రోకో నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను వంచించి రిజర్వేషన్ ఇస్తానంటూ ప్రగల్బాలు పలికిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రిజర్వేషన్ కాకుండానే ఎన్నికలకు వెళ్తామంటూ ప్రచారం చేయడం సరికాదన్నారు రానున్న రోజుల్లో బీసీలు కాంగ్రెస్, బిజెపిలకు తగిన బుద్ధి చెప్తారన్నారు. బిజెపి ఎంపీలు తక్షణమే బీసీ బిల్లును పార్లమెంట్లో ప్రస్తావని తేవాలన్నారు. లేని పక్షాన బిజెపి ఎంపీలను రాష్ట్రంలో తిరగనీయకుండా చేస్తామని హెచ్చరించారు.బీసీల ఓట్లతో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బిజెపిలు బీసీలను మోసం చేస్తున్నాయన్నారు బీసీలకు 42% రిజర్వేషన్ చేయకుంటే ఊరుకునేది లేదన్నారు. బీసీ జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ ఆవిడపు ప్రణయ్ మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు బీసీలపై సమితి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని 42% బీసీ రిజర్వేషన్ కోసం రానున్న రోజుల్లో జిల్లాలో ఉధృతంగా ఉద్యమిస్తామని బీసీ రిజర్వేషన్ కాకుండా ఎన్నికల నిర్వహిస్తే బీసీలు ఎన్నికలను బహిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యాధికార పార్టీ రాష్ట్ర నాయకులు కోట వెంకన్న, బీసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వైరగడే మారుతి పటేల్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు లోబడి లవ్ కుమార్, బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ మాచర్ల శ్రీనివాస్,పిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి కోట ఆనంద్ యాదవ్, రెడ్డిక సంఘం జిల్లా అధ్యక్షుడు అనిముల శంకర్, పద్మశాలి సంఘం ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షులు అనుమడ్ల శ్రీకాంత్ ,బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కిరణ్, బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు సిరికొండ సాయికృష్ణ, గంగపుత్ర సంగం జిల్లా అధ్యక్షులు పర్రె యాదగిరి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కావుడే మోతిరావ్, శెండే నాందేవ్, నీకోడే హనుమంతు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



# నేరాల నియంత్రణకు చర్యలు

**నిర్మల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలను డీజీపీ ఆదేశాల మేరకు తీసుకుంటున్నట్టు జిల్లా ఎస్పీ జానకి తెలిపారు. నేరాల నియంత్రణపై బుధవారం డిజిపి వీడియో కాన్ఫరెన్స్లో పలు సూచనలు చేసినట్టు తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ నిబంధనలపై అవగాహన కల్పించాలని డిఫెన్స్ డ్రైవింగ్‌పై దృష్టి పెట్టాలని దొంగతనాలు ఆర్థిక నేరాల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించినట్టు తెలిపారు. జిల్లాలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని నేరాల సంఖ్యను తగ్గించాలని పేర్కొన్నారు. బైంసా ఏఎస్పీ అభిలాష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# విజ్ఞానం ద్వారానే సమాజం అభివృద్ధి

**నిర్మల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

విజ్ఞానం ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆ విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను సద్వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జున్ అలీ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సమావేశంలో హాజరయ్యారు. సరస్వతి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం నిర్మల్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జున్‌అలీ, ముఖ్య అతిథులుగా శ్రీ సామ భీమ్ రెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ప్రాధాన్యతను వివరించారు. పాటకుల కోసం జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిక్షపతి నాయక్ కవితను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు నాందేడ్ చిన్ను యూత్ జిల్లా అధ్యక్షులు సమరసింహారెడ్డి నాయకులు గణేష్ బిక్షపతి నాయక్ ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రంథాలయ అధికారి మోహన్ సింగ్, ఆశాకిరణ్, సుజాత, గ్రంథాలయ సిబ్బంది విజయ సంజీవరెడ్డి, రాథోడ్ మోహన్ సింగ్, రాజు, పృథ్విరాజ్ లెనిన్ బాబురావు గ్రంథాలయ ప్రగతి నివేదిక మోహన్ సింగ్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



# బాలల హక్కులపై అవగాహన




**ఆసిఫాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామంలోని ఎంపీ యూపీఎస్ పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ బాలలకు నాలుగు ప్రధాన హక్కులు ఉన్నాయని వెల్లడించారు. జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్యపు హక్కు బాలలు తమ హక్కులను తెలుసుకొని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను సాధించాలని వారు సూచించారు. బాలల హక్కులకు భంగం కలిగితే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్లు సంప్రదించాలని సూచించారు అనంతరం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి బాలల హక్కుల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బాల ప్రవీణ్ కుమార్, చంద్రశేఖర్, జమున, రవళి, వెంకటేశ్వర్లు, రాణి, రాజేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బాలల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల, భుక్తాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన అవసరమని, తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటి చిన్న అలవాట్లు కూడా పెద్ద మార్పులు తీసుకొస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు బాలల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించామని వివరించారు. గతంలో రాగి, జొన్న వంటి పౌష్టికాహారాన్ని పెద్దవాళ్లు ఎక్కువ తీసుకునేవారని, ప్రస్తుతం పిల్లల్లో పోషకాహార లోపం పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మాయిల్లో పీరియడ్స్ కారణంగా అనీమియా ఎక్కువగా కనిపిస్తోందని, ఇందుకు ఐరన్ మాత్రలను ప్రభుత్వం అందిస్తున్నదని చెప్పారు. పాఠశాల మెనూ లో తప్పని సరిగా పౌష్టికాహారాన్ని చేర్చాలని సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఇంగ్లీష్ నేర్చుకోవడంలో పిల్లలు ముందుకు రావాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. మంచి ర్యాంకులను సాధించేందుకు క్రమశిక్షణతో చదవాలని సూచించారు. సోషల్ మీడియా దూరం పాటించి, మొబైల్ వినియోగాన్ని తగ్గించాలని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. పాఠశాలల్లో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలని, సైబర్ క్రైమ్‌ల నుంచి జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవొద్దని, ఇలాంటి ప్రయత్నాలు జరిగితే వెంటనే తల్లిదండ్రులకు సమాచారమివ్వాలని చెప్పారు. అనంతరం ప్రశంస పత్రాలను విద్యార్థులకు అందజేశారు.



## ప్రతి రైతు వివరాలను నమోదు చేయించుకోవాలి

**జన్నారం, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలను నమోదు చేయించుకోవాలని జన్నారం మండలం పోన్కల్ క్లస్టర్ ఏఈఓ త్రిసంధ్య కోరారు. అధికారుల ఆదేశాల మేరకు గురువారం పోన్కల్ రైతులు వేదికలో పలు గ్రామాల నుంచి వచ్చిన రైతుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేశారు. కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ నగదు ప్రయోజనాన్ని పొందాలంటే ప్రతి రైతు విధిగా వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. దీనికి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లు తీసుకురావాలన్నారు. ఈ ఫార్మార్ రిజిస్ట్రేషన్ రిజిస్ట్రేషన్ కవ్వాల్ క్లస్టర్ ఏఈఓ అక్రమ్ దేవుని గూడా రైతు వేదికలో, సింగరాయపేట క్లస్టర్ ఏఈఓ సాయి తిమ్మాపూర్ రైతు వేదికలో, కలమడుగు క్లస్టర్ ఏఈఓ దివ్య కలమడుగు రైతు వేదికలో, చింతగూడ క్లస్టర్ ఏఈఓ లవన్‌కృష్ణ చింతగూడా రైతు వేదికలో కార్యక్రమాలను నిర్వహించారు.

## కులం పేరుతో దూషించిన వ్యక్తికి 6 నెలల జైలు శిక్ష

**ఆసిఫాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

కులం పేరుతో దూషించిన ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రధాన న్యాయమూర్తి కుమార్ వివేక్ గురువారం తీర్పు ఇచ్చారు. ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ రూరల్ మండలం బట్టుపల్లి గ్రామంలో కుటుంబ వేడుక జరుగుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి ఓ వ్యక్తిని కులం పేరుతో దూషించాడు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు నేరం రుజువు కావడంతో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ప్రధాన న్యాయమూర్తి అతనికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 2500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

## బేలలోనే డిగ్రీ పరీక్ష కేంద్రం కొనసాగించాలి

**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

బేల మండల కేంద్రంలోనే డిగ్రీ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నిఖిల్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. దూర భారంతో పాటు చలి, ఆకలిని తట్టుకోని విద్యార్థులు వస్తున్నారని, వెంటనే మండల కేంద్రంలో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. గతంలో బేల మండల కేంద్రంలో ఉన్న సెంటర్ ను ఆదిలాబాద్ కు మార్చడంతో 50 మీటర్ల నుంచి విద్యార్థులు పరీక్షలు రాయడానికి అనేక ఇబ్బందులతో వస్తున్నారని ఏబీవీపీ కన్వీనర్ నిఖిల్ తెలిపారు. బేల మండలంలో 600 మంది విద్యార్థులుంటే కేవలం 477 మంది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ప్రస్తుతం చలి తీవ్రత కూడా ఎక్కువగా ఉందన్నారు.




సెంటర్ దూరం, ఆకలిని తట్టుకోని వస్తున్నారని తెలిపారు. అధికారులు, ప్రభుత్వం ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయి, పృథ్వీ, కిరణ్, మణిష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## జన్నారంలో సెంట్రల్ లైటింగ్, మురుగునీటి కాలువలను ఏర్పాటు చేయాలి



**జన్నారం, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టంతో పాటు రోడ్డుకిరువైపులా మురుగునీటి కాలువలను ఏర్పాటు చేయాలని జన్నారం మండల మున్నూరు కాపు సంఘ నాయకులు ఖానాపూర్ ఎమ్మెల్యే బెడమ బొజ్జు పటేల్ కు గురువారం వారి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. అలాగే మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘ భవనానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. సందర్భంగా మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మణ్ మాట్లాడుతూ, కాపు సంఘ నాయకులంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. అనంతరం మండల తాసిల్దార్ రాజ మనోహర్ రెడ్డికి వినతి పత్రం అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు లెక్కల మల్లయ్య, నాసాని శ్రీనివాస్ కస్తూరి భూమన్న బొడ్డు రాజన్న భూతం శ్రీనివాస్, అప్పల జలపతి పూదరి నరసయ్య చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రిని కలిసిన ముధోల్ ఎమ్మెల్యే

**ముథోల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్‌ను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అభివృద్ధి అంశాలపై ఇరువురూ చర్చించారు. వెనుకబడిన ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నాయకులు రమేష్, భోస్లే పండిత్ పటేల్, వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యంతో సాగాలి



**ఆసిఫాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యంతో ముందుకు సాగాలని జిల్లా సంక్షేమాధికారి, డీసీపీవో మహేష్ అన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఆసిఫాబాద్ మండలంలోని అంకుశాపూర్ ఎంపీయూపీఎస్ పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమాధికారి, డీసీపీవో మహేష్‌తో కలిసి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకొని ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను సాధించాలన్నారు. బాలల హక్కులకు భంగం కలిగితే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది బాలప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్, జమున, రవళి, వెంకటేశ్వర్లు, రాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

## కంప్యూటర్ల విడి భాగాలు విక్రయం

**మంచిర్యాల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి సేకరించిన ఉపయోగంలో లేని కంప్యూటర్ విడి భాగాలు విక్రయించనున్నట్లు డీఈఓ యాదయ్య తెలిపారు. మానిటర్లు, సీపీయు, యుపిఎస్, ప్రింటర్స్, కంప్యూటింగ్ యూనిట్స్, కీ బోర్డ్స్, మౌస్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు. కొనదలిచిన వారు రూ.10 వేలు ధరావత్తు సొమ్మును కొనే ధర కోడ్ చేసి సీల్డ్ కవర్‌లో ఈ నెల 25న సమర్పించాలని ఆయన సూచించారు.

# బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలి

**తాండూర్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

బడి బయట పిల్లలను గుర్తించేందుకు గురువారం నుంచి సీఆర్‌పీలతో సర్వేను ప్రారంభించామని మండల విద్యాధికారి ఎస్ మల్లేశం తెలిపారు. తెలంగాణ సమగ్ర శిక్షా సంచాలకుల ఆదేశాల మేరకు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన బడి బయట పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహించి వివరాలను ప్రబంద్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. బడి మధ్యలో మానేయడం, దానికి గల కారణాలు తెలుసుకొని విద్యార్థులను దగ్గరలో వున్న పాఠశాలలో చేర్పించాలని అన్నారు. తాండూరు మండల పరిధిలోని బడి బయట పిల్లలు 6 నుంచి 14 సంవత్సరములు, 15 నుంచి 20 సంవత్సరముల వయసు గల పిల్లల సర్వేను గురువారం నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మండల వ్యాప్తంగా ఎంఈవో, కాంప్లెక్స్ పరిధిలలో ప్రధానోపాధ్యాయులు సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తారని వివరించారు. కాంప్లెక్స్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్పీలు సర్వేలో భాగంగా ఆవాస ప్రాంతాల్లో బడి బయట పిల్లలను గుర్తిస్తారని తెలిపారు.



# జగిత్యాల -మంచిర్యాల హైవేకు లైన్ క్లియర్

- రూ. 2550 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
- అటవీ, పర్యావరణ అనుమతులు మంజూరు
- నాలుగో ప్యాకేజీ కింద రహదారి విస్తరణ
- 35.39 కిలో మీటర్ల మేర బ్రౌన్ ఫీల్డ్‌కు గ్రీన్ సిగ్నల్



**మంచిర్యాల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** జగిత్యాల-మంచిర్యాల నేషనల్ హైవేకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇప్పటికే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల నుంచి అనుమతులు రాగా, తాజాగా రహదారి నిర్మాణానికి అవరమైన రూ. 2550 కోట్లు కేటా యించింది. దీంతో ఇంతకాలం సందిగ్ధంలో ఉన్న జా తీయ రహదారి (ఎన్‌హెచ్) -63కు ఎట్టకేలకు గ్రీన్ ల భించగా, త్వరలో కాంట్రాక్టింగ్ పూర్తి చేసుకొని, పనులు ప్రారంభం కానున్నాయి. ఎన్‌హెచ్-63ను కేంద్రం నాలుగు వరుసలుగా విస్తరిస్తుండగా, గరిష్టంగా మూడేళ్లలో ఈ రహదారి అందుబాటులోకి రానుంది. ఈ రోడ్డు మ హారాష్ట్రలోని దౌండ్ వద్ద మొదలై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ మీదుగా 1,065 కిలో మీటర్లు కొన సాగి ఒడిశాలోని కోరావుట్‌లో ముగుస్తుంది. తెలంగాణలో బోధన్- నిజామాబాద్-ఆర్మూరు-మెట్‌పల్లి-కోరుట్ల-జగిత్యాల-రాయపట్నం-లక్షెట్టి పేట-మంచిర్యాల-చెన్నూరు మీదుగా సాగు తుంది. లక్షెట్టిపేట మీదుగా సాగుతున్న రహదారి గద్దె రాగడి వద్ద చంద్రాపూర్-ఛత్తీస్‌గఢ్ ఎన్‌హెచ్ 363కి అనుసంధానం కానుంది. ఈ రహదారి ఆర్మూరు-మంచిర్యాల వరకు రోడ్లు, పట్టణాలు, గ్రామాల మీదుగా కొన సాగుతున్నందున గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మించాలని తొలుత నిర్ణయించినప్పటికీ, అందుకు భారీగా భూ సేకర ణ జరపాల్సి ఉండటం, భూములు ఇచ్చేందుకు రైతు లు ససేమిరా అనడంతో అలైన్‌మెంట్‌లో స్వల్ప మా ర్పులు చేశారు. ప్రస్తుతం ఊళ్లున్న ప్రాంతాల్లో బైపాస్ లు నిర్మించి, మిగతా పాత రోడ్డును విస్తరించేలా ప్రణాళిక రూపొందించారు. ఆర్మూరు నుంచి మంచిర్యాల వరకు రోడ్డు 131.8 కిలోమీటర్ల పొడవు ఉండనుండగా, రాయపట్నం నుంచి మంచిర్యాల వరకు 35.39 కి.మీ. మేర నిర్మాణం జరుగనుంది. రహదారి నిర్మాణం 4విడుతలుగా చేపట్టనుండగా నాలుగవ విడుతలో రాయపట్నం-మంచిర్యాల వరకు సాగనుంది.

**రైతుల ఆందోళనతో...**

ఎన్‌హెచ్-63 కోసం అధికారులు మూడు దఫాలుగా రూట్ మ్యాప్‌లో మార్పులు చేశారు. మొదటి అలైన్ మెంట్ ప్రకారం కొందరు బడా బాబులకు నష్టం వాటి ల్లుతండటంతో వారి ఒత్తిడికి తలొగ్గి రెండో రూట్ మ్యా ప్‌ను సిద్ధం చేశారు. అది లక్షెట్టిపేట నుంచి ముల్కల్ల వరకు పూర్తిగా నివాస గృహాల మీదుగా వెళ్తుంది. దీ నివల్ల సామాన్య ప్రజానీకానికి తీరని నష్టం కలిగేలా ఉంది. అష్టకష్టాలు పడి నిర్మించుకున్న ఇళ్లు కూల్చివే తకు గురవుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు సర్వే పనులను అడ్డుకోవడం, భూములు ఇచ్చేందుకుని రాకరిస్తూ పలు రకాల ఆందోళనలు నిర్వహించారు. దీనికి స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు మరో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. కొత్త అలైన్‌మెంట్‌తో జీవనా ధారామైన సాగు భూములను సేకరించేందుకు అధికా రులు చర్యలు చేపట్టారు. ఈ అలైన్‌మెంట్ ప్రకారం లక్షెట్టిపేట మండలం మీదుగా గోదావరి నదికి సమాం తరంగా పంట పొలాలు, చేల మీదుగా రహదారి ని ర్మాణం జరగాల్సి ఉంది. గతంలో ఈ ప్రాంత రైతులకు చెందిన భూములు పెద్ద ఎత్తున శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద ముంపునకు గరయ్యాయి. మిగిలిన కొద్ది పాటి భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మళ్లీ రహదారి నిర్మాణం కోసం తమ భూములు సేకరిస్తుండటంతో వారంతా ఆందోళనబాట పట్టారు. తమకు నష్టం కలిగించే రూట్‌మ్యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులకు విన్నవించారు. చివరి యత్నంగాహై కోర్టును సైతం ఆశ్రయించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో తాత్కాలికంగా రహదారి నిర్మాణానికి బ్రేకులు పడగా, నూతన అలైన్‌మెంట్ రూ పొందించి, అధికంగా భూ సేకరణ అవసరం లేకుం డానే జన సంచారం అధికంగా ఉన్న చోట బైపాస్ నిర్మాణాలతోపాటు మిగతాచోట్ల రహదారిని విస్తరించేందుకు మార్గం సుగమం అయింది.

**రహదారి నిర్మాణంలో....**

ఎన్‌హెచ్-63 నిర్మాణంలో భాగంగా ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు మొత్తం 131.8 కిలో మీటర్ల మేర సాగనుంది. ఇందు కోసం అవసర మైన ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఇప్పటికే సేకరిం చారు. అలాగే పలు నిర్మాణాలు కోల్పోతుండగా, 162 కుటుంబాలు నిర్వాసితులుగా మారనున్నాయి. రహ దారి నిర్మాణంలో భాగంగా 178 కిలోమీటర్ల ప్రభుత్వ భూములు అవసరం అవుతుండగా, 1317 ఎకరాల ప్రై వేటు భూములను సేకరించారు. మరో 38.05 కిలో మీటర్ల అటవీ భూములు సైతం రోడ్డు నిర్మాణంలో భాగం కానున్నాయి. అలాగే మొత్తం 131.8 కిలోమీటర్ల పొడవులో 135 నిర్మాణాలు కూల్చివేతకు గురవుతుండగా, 162 కుటుంబాలు నిర్వాసితులు కానున్నాయి. దీంతో రోడ్డు విస్తరణలో భూములత కోల్పోతున్న నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంగా ఉండండి

## వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని




**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** స్థానిక సంస్థలఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ జాబితా తయారీ పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, త్వరలో గ్రామ పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపిటిసి ఎన్నికల నిర్వహించనున్న నేపథ్యంలో సజావుగా ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా, ప్రతి ఫేజ్‌లో ఏ మండలాల్లో ఎన్నికలు జరగాలో ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. పాత పద్ధతిలో రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నందున, సెప్టెంబర్ 2న విడుదల చేసిన పంచాయతీ తుది ఓటర్ జాబితా సంబంధించి ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి నవంబర్ 22 లోపు పరిష్కరించాలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నవంబర్ 23న ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఫోటోలతో కూడిన ఓటర్ జాబితా ప్రచురణ పూర్తి చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జడ్పీ సీఈవో రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్‌కు జర్నలిస్టుల అభినందనలు

**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** రాష్ట్రపతి ద్రౌపది ముర్మ చేతుల మీదుగా ఇటీవల స్థాయి పురస్కారం అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షాను జర్నలిస్టులు అభినందించారు. గురువారం ఆదిలాబాద్‌లో కలెక్టర్‌ను కలిసిన జర్నలిస్టులు శాలువా కప్పి మెమొంటోతో సత్కరించారు. జిల్లాకు జాతీయస్థాయి అవార్డు రావడం జిల్లా అభివృద్ధికి మరింత దోహదం చేస్తాయని ఆకాంక్షించారు.

## దేవస్థానాల అభివృద్ధికి జీవో తీసుకురావాలి

**ఉట్నూర్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** గోండ్వాన దేవస్థానాల అభివృద్ధి కోసం ప్రత్యక జీవోను తీసుకురావాలని రాజ్ గోండ్ సేవ సమితి సభ్యులు కోరారు. గురువారం ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఆదివాసీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోండు మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు అర్జు, విషంరావు, మోతిరాం ఉన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**భీంపూర్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జ్ ఆడే గజేందర్ అన్నారు. గురువారం భీంపూర్ మండలంలోని రాంపూర్ గ్రామస్థులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు గ్రామంలోని పలు సమస్యలను ఆయనకు వివరించారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని వారికి గజేందర్ హామీ ఇచ్చారు.

## చలో భోరజ్‌ను జయప్రదం చేయండి

**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** అఖిల పక్షం ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహించే 'హలో రైతన్న చలో భోరజ్' కార్యక్రమం విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు దత్త్రాత్రి అన్నారు. గురువారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధిక వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు పండించిన పత్తి పంటను డిసెంబర్ నెల చివరి వరకు కొనుగోలు చేయాలన్నారు.

## కాలనీలో జాడూ చలావు యాత్ర

**నిర్మల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** పట్టణంలోని ప్రియదర్శినగర్ సాగర్ రోడ్డు గాజులపేట్ తదితర కాలనీలో గురువారం ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ హైదర్ ఆధ్వర్యంలో జాడూ చలావు యాత్ర నిర్వహించారు. కాలనీలోకి వెళ్లి వారు ఎదురుకుంటున్న సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. సీసీ రోడ్లు, మురికి కాలువలు విద్యుత్ దీపాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అధికారులు వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని కోరారు.



# శిశుమందిర్ రోడ్డు బాధితుల ఆందోళన

**బెల్లంపల్లి, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** బెల్లంపల్లి పట్టణంలో శిశుమందిర్ రోడ్డు విస్తరణ బాధితులు గురువారం రాత్రి రోడ్డుకు అడ్డంగా కూర్చొని ఆందోళనకు దిగారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించిన బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. గత 70 ఏళ్లుగా ఇదే రోడ్డుపై నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనాన్ని పొందుతున్న తమకు రోడ్డు విస్తరణ పనులు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిని దెబ్బతీసే విస్తరణ పనులను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు అభివృద్ధి పేరిట జీవనోపాధిని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు రెండు గంటలకుపైగా శిశుమందిర్ రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ ఆందోళనను కొనసాగించారు.



బాధితుల ఆందోళనతో చిన్నభూథ, బెల్లంపల్లి వైపుకు వాహనాలు ఇక్కడిక్కడ నిలిచిపోయాయి. గొడవ జరగకుండా పోలీసులు పర్యవేక్షించారు. మున్సిపల్ అధికారులతో చర్చించి ఆందోళన విరమించాలని సూచించినప్పటికీ వారు వినలేదు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని మున్సిపల్ సిబ్బంది తెలపడంతో వారు ఆందోళన విరమించారు.



### ప్రజల్లో చైతన్యం కోసం పోలీసుల గ్రామీణ ప్రాంతాల్లో

# సామాజిక అంశాల పై విస్తృత అవగాహన

- డయల్ 100పై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
- జిల్లాలో 19 పోలీస్ స్టేషన్‌లలో డయల్ హండ్రెడ్
- బృందాలచే కార్యక్రమం నిర్వహణ
- మూఢనమ్మకాలపై కళాబృందాలతో ప్రదర్శన
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ప్రజల రక్షణకై, భద్రతకి జిల్లా పోలీసులు అప్రమత్తతో ఉంటూ విధుల నిర్వహణ చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ, గత మూడు వారాలుగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ కార్యాలయాల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న డయల్ హండ్రెడ్ సిబ్బంది, గ్రామాలను సందర్శిస్తూ ప్రజలలో చైతన్యపరిచే కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లాలోని మొత్తం 19 మండలాలలోని డయల్ 100 పోలీసు సిబ్బంది గ్రామాలు, పట్టణంలోని వార్డులలో సందర్శిస్తూ పోలీసు మీకోసం కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలపై మరియు ప్రజలు చేస్తున్న పొరపాట్లపై, వాటి వల్ల కలుగు అనార్థాలపై, సవివరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో ముఖ్యంగా సైబర్ క్రైమ్ ద్వారా నవీన పద్ధతుల్లో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్న విధానాలను వివరించడం జరుగుతుంది. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి రోడ్ సేఫ్టీ క్లబ్ పేరుతో జిల్లాలో మొట్టమొదటిసారిగా ప్రారంభించబడిన కార్యక్రమంలో ప్రజల పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహిళల పట్ల జరుగు నేరాలపై, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది. ముఖ్యంగా బాల్య వివాహాలు జరగకుండా ప్రజలలో చైతన్య పరచడం జరుగుతుందని




తెలిపారు. మహిళలు, చిన్నారుల పట్ల జరుగు నేరాలు, పోక్సో చట్టం పై ప్రజలకు అవగాహన కల్పించి, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌లపై సవివరంగా వివరిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న సందర్భంలో ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించి వాహనం నడపాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపకుండా ఇతరులకు ప్రమాదాలు చేయకుండా తాము ప్రమాదాలకు గురి కాకుండా ఉండాలని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి యువత దేశ భవిష్యత్తును నాశనం చేస్తుందని విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా పోలీసులు 24 గంటలు ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకై విధులను నిర్వర్తిస్తుంటారని, ఏ సందర్భంలోనైనా ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా డయల్ 100 ద్వారా జిల్లా పోలీసుల సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగిన సమాచారం మీకున్న, మెసేజ్ యువర్ ఎస్పి అనే కార్యక్రమం ద్వారా ప్రారంభించబడిన 8712659973 నెంబర్ కు వాట్సాప్ ద్వారా సమాచారాన్ని అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. సుదూర ప్రాంత ప్రజలు తమ సమస్యలను తమ ప్రాంతంలో జరిగే ఆసాంఘిక కార్యకలాపాల పట్ల సమాచారాన్ని అందించవచ్చు అని తెలిపారు.

# పంటల కొనుగోళ్లు పకడ్బందీగా సాగాలి




### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో పంటల కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంటల కొనుగోలు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వరి, సోయా, పత్తి, మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించి కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 14,760.56 క్వింటాళ్ల వరి ధాన్యం, 5,746 క్వింటాళ్ల సోయా, 7,715 క్వింటాళ్ల మొక్కజొన్న, 66,140 క్వింటాళ్ల పత్తి పంటను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. తగు తేమ శాతం వచ్చిన తరువాతే రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తుందని తెలిపారు. 7 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చిన రైతులు తమ వివరాలను మండల వ్యవసాయ అధికారుల ద్వారా నమోదు చేయించి, పంట ఉత్పత్తి పరిశీలన చేపట్టించుకోవాలన్నారు. ఆ వివరాలను కొనుగోలు కేంద్రాలకు అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 351 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యానికి వంద శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తిచేయాలని, ప్రతీ కేంద్రంలో ప్యాడి క్లీనర్లను ఉపయోగించాలని సూచించారు. కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంటల కొనుగోలులో రైతులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పత్తి రైతుల సౌకర్యార్థం 1800 599 5779 టోల్ ఫ్రీ నెంబరు, 88972 81111 వాట్సాప్ నెంబర్లు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ సుధాకర్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



### ప్రీ మెట్రిక్ ఉపకార

# వేతనాలపై అవగాహన

**ముథోల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

రాజీవ్ విద్య యోజన పథకంలో భాగంగా ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు 9వ,10వ  ఎస్సి విద్యార్థులు దరఖా చేసుకోవాలని ఎడ్ బిడ్, ముథోల్ వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులు నగేష్, శారద అవగాహన కల్పించారు. గురువారం ముథోల్ తానూరు మండలంలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9, పదో తరగతి చదువుతున్న ఎస్సి విద్యార్థులు  ప్రీ మెట్రిక్ ఉపకర వేతనాలకు దరఖాస్తులు చేసుకునేలా ప్రధాన ఉపాధ్యాయులు ప్రోత్సహించలని కోరారు. ఆయా పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. తగిన గడువు సమయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో  ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

### మిషన్ భగీరథ నీటిని సక్రమంగా

# వినియోగించుకోవాలి

**జన్నారం, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా అందించే మిషన్ భగీరథ నీటిని ప్రజలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని మిషన్ భగీరథజిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ రవీందర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశం సూచించారు. గురువారం  జన్నారం మండలంలోని కలమడుగు, బంగారు తండా, సోనాపూర్ తండా గొండు గూడా తదితర ప్రాంతాల్లో పర్యటించి, భగీరథ నీటి సరఫరా పై ఆరా తీశారు. నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నీటిని వృథా చేయకుండా సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. సరఫరాలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఏఈఈ నందన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు 'హలో రైతన్న చలో భోరజ్'

### మాజీ మంత్రి జోగు రామన్న

**జైనథ్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట కొనుగోళ్లలో విధిస్తున్న నిబంధనల కారణంగా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. రైతుల పక్షాన చేపట్టనున్న ఛలో బోరజ్ జాతీయ రహదారి దిగ్బంధాన్ని విజయవంతం కు రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. గురువారం జైనథ్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ధర్నాలో కాంగ్రెస్, బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు పాల్గొననున్నాయని పేర్కొన్నారు. ఈనెల 21న 'హలో రైతన్న ఛలో  బోరజ్' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంట కొనుగోళ్ళ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన నిబంధనలు తీసుకువచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు. వీటి కారణంగా రైతులకు మద్దతు ధర దక్కడం లేదని, తక్కువ ధరకే ప్రైవేటుకు అమ్ముకుంటున్నారని అన్నా రు. పత్తి రైతులకు అండగా చేపట్టనున్న ధర్నా కు రైతులు పెద్ద



సంఖ్యలో తరలిరావాలన్నా రు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తాను మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆఫ్ రికార్డులో ఇరవై శాతం తేమ వచ్చిన పత్తిని సైతం పన్నెండు శాతం చేయించి కొనుగోళ్ళు చేయించిన విషయాన్నీ గుర్తు చేశారు. ఈ విషయాన్నీ రికార్డుల్లో చూపించాలని ఎమ్మెల్యే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుల ఇబ్బందులు పరిష్కారమైతే తామే ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు రైతులకు న్యాయం చేయని పక్షంలో మరింత ఉధృతంగా పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యాలయంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాసం నర్సింగ్ రావు,  రైతులు పాల్గొన్నారు.

### పేకాట స్థావరాలపై

# టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

**ఆసిఫాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

పేకాట స్థావరాలపై దాడి చేసి ఏడుగురు వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ మండలంలోని ఎల్లారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో గురువారం ఉదయం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు పేకాట రాయుళ్లు పట్టుబడగా, వారి వద్ద నుంచి రూ. 4,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారి పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.





# టికెట్ ధర రూ.99 మాత్రమే

పైరసీపై పోరాటంలో భాగంగా ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సంస్థలో రూపొందిన 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా టికెట్ ధరను రూ.99కి తగ్గించింది. సింగిల్ థియేటర్లలో ఈ ధర అందుబాటులో ఉంటుందని. మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ.105గా నిర్ణయించినట్టు ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ తెలిపారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో 'రాజు వెడ్స్ రాంబాయి' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. ప్రముఖ కథానాయకుడు కిరణ్ అబ్బవరం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అఖిల్, తేజస్విని జంటగా సాయిలు కంపాటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. వేణు ఊడుగుల నిర్మాత. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ నెల 21న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.ఈ వేడుకని ఉద్దేశించి సాయికృష్ణ మాట్లాడుతూ "పైరసీపై ఈటీవీ విన్ మొదట్నుంచీ పోరాటం కొనసాగిస్తూనే ఉంది. మా వేదిక నుంచే విడుదలైన 'క' సినిమా వెంటనే పైరసీ కాకుండా చేయగలిగాం. అప్పట్లో దాని గురించి చాలా మంది మాట్లాడుకున్నారు. ఇటీవల ఐ బొమ్మ రవి అరెస్టు తర్వాత దాని గురించి మాట్లాడుకుంటున్నారు. అరెస్ట్ చేసిన తెలంగాణ పోలీసు అధికారులకు శుభాకాంక్షలు. అయితే ఈ అరెస్ట్ తర్వాత సినిమా టికెట్ ధరలు. థియేటర్లలో పాప్‌కార్న్ ధరలు పెరిగిపోయాయని. అవి తగ్గితే థియేటర్లకు వస్తాం కదా అనే అభిప్రాయాలు చాలా మంది నుంచి వినిపిస్తున్నాయి. అది దృష్టిలో పెట్టుకునే మా సినిమా టికెట్ ధరల్ని తగ్గించాలని నిర్ణయం తీసుకున్నాం.




# అది నా నంబరు కాదు

ఇటీవలే వాట్సప్‌లో తన పేరు, ఫొటో వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని.. అలాంటి ఫేక్ అకౌంట్‌ల నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ నటి అదితిరావు హైదరి విజ్ఞప్తి చేశారు. తాజాగా మరో నటి శ్రియ శరణ్ కూడా ఈ నకిలీ వాట్సప్ బారినపడ్డారు. ఆమె ఈ విషయాన్ని ఇన్‌స్టాలో ఓ పోస్ట్ ద్వారా తెలిపారు. ఈ పోస్ట్‌కి "ఈ వ్యక్తి ఎవరో నాకు తెలియదు. దయచేసి ఇలాంటి వారితో చాట్ చేసి మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకండి. ఇలా జరగడం నాకు బాధగా ఉంది. ఇది నేను కాదు.. ఈ నంబర్ నాది కాదు. దురదృష్టం ఏంటంటే.. ఈ వ్యక్తి నా సన్నిహితులతో సహా నేను అభిమానిస్తూ కలిసి వర్క్ చేయాలనుకునే వారికి కూడా మెసేజ్‌లు చేస్తున్నాడు. చాలా వింతగా అనిపిస్తుంది. ఇలా చేయడానికి మీ సమయాన్ని ఎందుకు వృథా చేసుకుంటున్నారు?" అంటూ శ్రియ అందరూ అప్రమత్తంగా ఉండాలనే వ్యాఖ్యల్ని జోడించారు

# ఓటీటీలోకి సైకలాజికల్ థ్రిల్లర్..



ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు నేరుగా మరో సినిమా ఓటీటీలో విడుదలకు సిద్ధమవుతోంది. డిసెంబరు 5 నుంచి 'నెట్‌ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ కానుంది. అదే సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'స్టీఫెన్' 'గార్గి' ఫేమ్ గోమతి శంకర్ ప్రధాన పాత్రలో కొత్త దర్శకుడు మిథున్ బాలాజీ రూపొందించిన చిత్రమిది. ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌ను తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీలో అందుబాటులో ఉంచనున్నట్లు ఓటీటీ సంస్థ ప్రకటించింది. (*గమనిక: స్ట్రీమింగ్ సమయానికి ఆడియో పరంగా కొన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండొచ్చు)."దక్షిణాది సినిమాలు, సిరీస్‌లకు సంబంధించి మా లైనప్‌లోని 'స్టీఫెన్' ఆసక్తికరమైంది. ఓ సీరియల్ కిల్లర్ చుట్టూ తిరిగే కథ ఇది. తర్వాత ఏం జరుగుతుంది? అని చివరి వరకూ ప్రేక్షకుడిలో ఉత్కంఠ రేకెత్తిస్తుంది. తొలి ప్రయత్నంలోనే మిథున్ బాలాజీ మిమ్మల్ని మెప్పిస్తారు" అని నెట్‌ఫ్లిక్స్ కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ (ఇండియా) మోనికా షేర్గిల్ ఆశాభావం వ్యక్తం చేశారు.



# ప్రభాస్ 'స్పిరిట్' టెస్ట్ షూట్ ఫినిష్..

రెబల్ స్టార్ ప్రభాస్ త్వరలో సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' చిత్రంలో కనిపించబోతున్నారు. ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన టెస్ట్ సమాచారం. ఫస్ట్ లుక్ లో ప్రభాస్ ఒక పోలీస్ పాత్రలో కనిపించబోతున్నాడు, ఇది ఆయన కెరీర్‌లో మొదటిసారి. అయితే ఈ చేంజ్ అభిమానులను, టీమ్‌ను కూడా ఆశ్చర్యపరిచింది.అందరికీ తెలిసినట్లుగా, ప్రభాస్ కు కొత్త కొత్త జానర్స్ చేయడం చాలా ఇష్టం. టెస్ట్ సీక్వెన్సుల్లో ఆయన ఇంటెన్స్ పెర్ఫార్మన్స్ చూపించారని సమాచారం. ఇది లైవ్ గా షూట్ చూశారంటే, ప్రభాస్ పాత్రను చాలా డెప్త్ తో చేసారని చెప్పుకుంటున్నారు. సందీప్ రెడ్డి వంగా కూడా ఈ టెస్ట్ షూట్ తర్వాత చాలా ఉత్సాహంగా ఉన్నారు. ప్రభాస్ ఇప్పటివరకు చూడని కొత్త రూపంలో కనిపించబోతున్నాడు. అయితే, స్పిరిట్ పూర్తి షూటింగ్ ప్రారంభం కోసం అభిమానులు వేచి చూస్తున్నారు. ప్రస్తుతంలో ప్రభాస్ 'ది రాజా సాబ్', 'ఫౌజీ' సినిమాల్లో బిజీగా ఉన్నారు. ఆ రెండు కమిట్మెంట్స్ పూర్తయ్యాకే స్పిరిట్ షూటింగ్ ఫుల్ స్వింగ్ లో ప్రారంభమవుతుంది.ప్రభాస్ 'బాహుబలి: ది ఎపిక్' 4K రీ–రిలీజ్ కోసం డిసెంబర్‌లో జపాన్ కి వెళ్లబోతున్నారని కూడా వార్తలు వచ్చాయి. గత సంవత్సరం 'కల్కి 2898 AD' ప్రీమియర్ కోసం ప్రభాస్ వెళ్లలేకపోయాడు, కాబట్టి ఈసారి అభిమానులను నిరాశపరచకుండా ట్రిప్ ఖరారు అయ్యింది.మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న హారర్ కామెడీ ది రాజా సాబ్ పై అభిమానుల అంచనాలు భారీగా ఉన్నాయి. ముఖ్యంగా సినిమా ఫస్ట్ సింగిల్ కోసం ఫ్యాన్స్ చాలా కాలం ఎదురుచూస్తున్నారు. మొదట ప్రభాస్ పుట్టినరోజున విడుదల చేయాలని ప్లాన్ చేయగా, తర్వాత నవంబర్ మొదటి వారానికి మార్చారు. ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం, ఈ సింగిల్ నవంబర్ 24న రిలీజ్ అవుతుంది. అధికారిక ప్రకటన ఈ వారంలో జరగనుంది. వచ్చే జనవరి 9న సినిమా ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కావడంతో, ప్రమోషన్స్‌ను ఈ నెలలో ప్రారంభించడం టీమ్‌కి ముఖ్యంగా అవసరం. ఈ మూడు అప్‌డేట్స్ స్పిరిట్ టెస్ట్ షూట్, బాహుబలి జపాన్ రీ–రిలీజ్, ది రాజా సాబ్ ఫస్ట్ సింగిల్ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

# కృతి ఇక నాటికి కూడా సై అనేస్తుందా..?



ఉప్పెనతో తెరంగేట్రం తోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న హీరోయిన్ కృతి శెట్టి ఆ సినిమా ఇచ్చిన పుష్ తో ఏకంగా అరడజను సినిమాలు ఆగకుండా చేసింది. మొదటి సినిమా తర్వాత వచ్చిన శ్యామ్ సింగ రాయ్, బంగార్రాజు అమ్మడిని ఒడ్డున పడేసినా నెక్స్ట్ ఇక చేసిన ప్రతి సినిమా డిజాస్టర్ అయ్యింది. ఇక వరుస ఫ్లాపుల వల్ల కృతి శెట్టికి ఛాన్స్ లు కూడా కరువయ్యాయి. చివరగా శర్వానంద్ తో కృతి శెట్టి చేసిన మనమే సినిమా కూడా డిజప్పాయింట్ చేయడంతో అమ్మడు ఇక మరింత రిస్క్ లో పడింది.తెలుగులో అవకాశాలు లేవు కానీ తమిళ్ లో కృతి శెట్టికి ఛాన్స్ లు వచ్చాయి. అక్కడ రవి మోహన్ తో జినీ సినిమా చేస్తున్న కృతి శెట్టి ప్రదీప్ రంగనాథన్ తో L.I.K కూడా చేసింది. ఈ రెండు సినిమాలు కూడా డిసెంబర్ లో రిలీజ్ కాబోతున్నాయి. తమిళ్ లో తన కెరీర్ బాగుండాలి అంటే కృతి శెట్టి ఈ సినిమాలతో కచ్చితంగా హిట్టు కొట్టాల్సిందే. ఐతే ఈమధ్య అమ్మడు ఫోటో షూట్స్ లో కూడా గ్లామర్ షోతో అదరగొట్టేస్తుంది.కృతి శెట్టి ఫోటో షూట్స్ ఎప్పుడూ సోషల్ మీడియాలో హంగామా చేస్తున్నాయి. ఐతే తనకు తొలి హిట్ ఇచ్చిన టాలీవుడ్ ని దూరం చేసుకోవడం ఇష్టం లేని అమ్మడు ఎలాంటి అవకాశం ఇచ్చినా నాకు ఓకే అనేస్తుందట. ప్రస్తుతం లీడ్ హీరోయిన్ ఛాన్స్ లు కష్టమని భావించిన కృతి శెట్టి స్టార్ సినిమాల్లో ఒక స్పెషల్ సాంగ్ ఛాన్స్ ఇచ్చినా చేయడానికి నేను రెడీ అంటుందట. కృతి శెట్టి స్పెషల్ సాంగ్ చేస్తే ఇప్పుడు అమ్మడు చేస్తున్న గ్లామర్ ఫోటో షూట్స్ కి పర్ఫెక్ట్ ఆప్షన్ అనేలా ఉంటుంది.కృతి శెట్టి కూడా ఇండస్ట్రీలో ఎప్పుడూ మనం అనుకున్న ఆఫర్లు రావడం కష్టం. ఒక్కోసారి అవకాశాలు వస్తున్న మార్గంలో మనం వెళ్లాల్సిందే అన్నట్టుగా ఆలోచిస్తుందట. మరి అమ్మడు నిజంగానే స్పెషల్ సాంగ్స్ కి సై అంటుందా లేదా అన్నది చూడాలి. ఉప్పెనతో తెలుగు తెరకు మరో టాలెంటెడ్ క్యూట్ లుక్స్ హీరోయిన్ వచ్చిందని అనుకున్న ఆడియన్స్ అంతా కృతి ఫెయిల్యూర్స్ చూసి అవాక్కవుతున్నారు. తెలుగులో ఒకే ఒక్క ఛాన్స్ కోసం కృతి శెట్టి చాలా ఆసక్తిగా ఎదురు చూస్తుంది. ఐతే ఆ ఛాన్స్ ఇచ్చి ఆమెను ఎవరు ఎంకరేజ్ చేస్తారన్నది చూడాలి. ఎలాగు కృతి శెట్టి చేస్తున్న ఎల్.ఐ.కె తెలుగులో కూడా రిలీజ్ ఛాన్స్ ఉంటుంది. సో అలా అయినా తెలుగు ఆడియన్స్ ముందుకు మరోసారి అమ్మడు తన టాలెంట్ చూపించే అవకాశం అందుకుంటుందో చూడాలి కున్నట్టు




# శీఘ్ర వృద్ధాప్యం!

## కొవిడ్‌తో వయసు కంటే ముందే రక్తనాళాలకు ముసలితనం

- గుండెపోటు ముప్పుపై పరిశోధకుల హెచ్చరిక
- తేలికపాటి ఇన్ఫెక్షన్ తోనూ గుండె, పక్షవాతం ముప్పు
- పురుషుల కంటే మహిళల ధమనులపైనే తీవ్ర ప్రభావం
- లాంగ్ కొవిడ్ బాధితుల్లో ఈ సమస్య మరింత తీవ్రం
- వ్యాక్సిన్ తీసుకున్నవారిలో రక్తనాళాలు మెరుగ్గా ఉన్నట్టు గుర్తింపు





న్యూస్ డెస్క్
ప్రభాత సమాచారం

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించి ఏళ్లు గడుస్తున్నా.. దాని దీర్ఘకాలిక ప్రభావాలు ఒక్కొక్కటిగా బయటపడుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా జరిపిన ఒక విస్తృత స్థాయి అధ్యయనంలో కొవిడ్ ఇన్ఫెక్షన్, అది తేలికపాటిది అయినా సరే, మన రక్తనాళాలను వయసు కంటే ముందే బలహీనపరిచి, గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యల ముప్పును పెంచుతున్నట్లు వెల్లడైంది. ఈ ప్రభావం పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు.

**రక్తనాళాలపై తీవ్ర ప్రభావం..**
ఫ్రాన్స్‌లోని పారిస్ సిటీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రోసా మరియా బ్రూనో నేతృత్వంలోని పరిశోధక బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. 16 దేశాలకు చెందిన సుమారు 2,390 మందిపై 2020 సెప్టెంబర్ నుంచి 2022 ఫిబ్రవరి మధ్య పరిశోధనలు జరిపారు. 'కొవిడ్ వైరస్ నేరుగా రక్తనాళాలపై ప్రభావం చూపుతుందని మాకు తెలుసు. దీని వల్ల రక్తనాళాలు వయసు కంటే వేగంగా వృద్ధాప్యానికి గురవుతాయి. ఫలితంగా గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదం పెరుగుతుంది'అని ప్రొఫెసర్ బ్రూనో వివరించారు. ఈ అధ్యయన ఫలితాలను ప్రతిష్ఠాత్మక యూరోపియన్ హార్ట్ జర్నల్‌లో ప్రచురించారు.

**వ్యాక్సిన్ తీసుకున్నవారిలో తీవ్రత తక్కువ..**
కొవిడ్ సోకని వారితో పోలిస్తే ఇన్ఫెక్షన్ కు గురైన వారందరిలో.. ముఖ్యంగా మహిళలు, లాంగ్ కొవిడ్ లక్షణాలతో (ఆయాసం, అలసట వంటివి) బాధపడుతున్న వారిలో రక్తనాళాలు లేదా ధమనులు గట్టిపడినట్లు ఈ అధ్యయనంలో స్పష్టంగా తేలింది. అయితే, కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో ధమనులు అంతగా గట్టిపడలేదని, వారి పరిస్థితి కాస్త మెరుగ్గా ఉందని కూడా పరిశోధకులు గుర్తించారు.

**ఇన్ఫెక్షన్ తర్వాత రక్తనాళాలకు ఎక్కువ నష్టం..**
మహిళల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉండదానికి వారి రోగనిరోధక వ్యవస్థ పని తీరే కారణం కావచ్చని ప్రొఫెసర్ బ్రూనో అభిప్రాయపడ్డారు. 'మహిళల రోగనిరోధక వ్యవస్థ వేగంగా, బలంగా స్పందిస్తుంది. ఇది ఇన్ఫెక్షన్ నుంచి వారిని కాపాడుతుంది. కానీ, అదే బలమైన స్పందన ఇన్ఫెక్షన్ తర్వాత రక్తనాళాలకు ఎక్కువ నష్టం కలిగించవచ్చు'అని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో, కొవిడ్ బారిన పడిన వారిలో గుండె సంబంధిత ముప్పును ముందుగానే గుర్తించి, నివారణ చర్యలు



## వామ్మో చలి.. గిన్నెధరిలో అత్యల్పంగా 7.9 డిగ్రీలు

**ఆసిఫాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో చలి పంజా విసురుతోంది. ఉష్ణోగ్రతలు ఒక్క సారిగా పడిపోవడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. గురువారం జిల్లాలోని తిర్యాణి మండలంలోని గిన్నెధరి గ్రామంలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 7.9 డిగ్రీల ఉష్ణోగ్రతకు పడిపోయాయి. దీనికి తోడు గ్రామాల్లో పొగమంచు కమ్మేస్తోంది. చలికి ఏజెన్సీ మండలాలు గజగజ వణికిపోతున్నాయి. చిన్నారులు, వృద్ధులు చలి నుంచి రక్షణ పొందేందుకు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సాయంత్రం ఐదు గంటలు దాటితే జనాలు బయటికి వెళ్లనంత చలి తీవ్రత పెరగడంతో ఆసిఫాబాద్ ప్రాంతంలో జనజీవనం స్తంభిస్తోంది. ముఖ్యంగా అడవులు అధికంగా ఉన్న మండలాలైన తిర్యాణి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, బెజ్జూరు, చింతలమానెపల్లి, పెంచికలపేట, దహెగాం, కౌటాల, సిర్పూర్(టి), ఆసిఫాబాద్ ప్రాం తాల ప్రజలు చలి నుంచి రక్షణ పొందేందుకు షటర్లు, జర్కిన్‌లు ధరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చీకటైతే చాలు ఇళ్ల ముందు నెగళ్లు ఏర్పాటు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. చలితీవ్రత గతంలో ఎప్పుడు లేనంతగా కనిపిస్తుండడంతో రానున్న రోజుల్లో ఈ తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందోనన్న ఆందోళన జిల్లా వాసుల్లో వ్యక్తమవుతోంది. నిజానికి ఆసిఫాబాద్ ప్రాంతంలో చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. ఈ సారి చలి పంజా విసురుతుండడంతో జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్ డివిజన్ కేంద్రం చీకటి పడితే చాలు జనాలు లేక బోసిపోతోంది. 9గంటలు దాటితే కానీ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. చలి తీవ్రత పెరగడంతో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## చికిత్స పొందుతూ వృద్ధుడిమృతి

**నర్సాపూర్ (జి), నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**
జీవితంపై విరక్తితో ఈ నెల 18న మంగళవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు. మండలంలోని తురాటి గ్రామానికి చెందిన బోడ్కర్ నారాయణ (68) నాలుగు నెలల క్రితం కంటి ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి కళ్లు సరిగా కనిపించడం లేదని, నరాలు నొప్పి పెడుతు న్నాయని బాధపడుతూ ఉండేవాడు. వృద్ధాప్య రీత్యా జీవితంపై విరక్తి చెంది ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు బోడ్కర్ శ్రీకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## చెట్టుపై నుంచి పడి గీత కార్మికునికి గాయాలు

**ఖానాపూర్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**



ఖానాపూర్ మండలంలోని బాదనకుర్తి గ్రామంలో గురువారం తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికునికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కొత్తకొండ భూమాగౌడ్ తాటిచెట్టు ఎక్కేందుకు బాదనకుర్తి గ్రామా నికి వెళ్లాడు. చెట్టు ఎక్కిదిగే క్రమంలో నడుముకు, కాళ్లకు వేసుకున్న మోకు, గుయ్యి జారిపోవడంతో కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌కు తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో పూజారికి గాయాలు

**జన్నారం, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**



జన్నారం మండలంలోని పైడిపెల్లి గ్రామ సమీపంలో గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని కేతేశ్వర కంకాలమ్మ ఆలయ పూజారి భూమయ్యకు తీవ్రగా యాలయ్యాయి. పైడిపెల్లి వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో లక్షెట్టిపేట ఆస్పత్రికి తరలించారు.

## సింగరేణి రిటైర్డ్ కార్మికుడి ఆత్మహత్య

**జైపూర్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**



సింగరేణి రిటైర్డు కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన లింగయ్య (73) కొన్నేళ్ల క్రితం మామిడిచెట్టు పైనుంచి కిందపడడంతో నడుము విరిగింది. అప్పటి నుంచి నడుమునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

## డీఆర్ డిపో ఇంచార్జీపై చర్యలు

**తిర్యాణి, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**
గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో తిర్యాణి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న డీఆర్ డిపో ఇంచార్జీ కుర్సెంగ రత్న కిశోర్‌పై చర్యలకు జీసీసీ ఉట్నూర్ డివిజనల్ మేనేజర్ సందీపకుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.




- పంచాయతీ పోరుకు కసరత్తు షురూ..
- 'స్థానికం'పై మళ్లీ సర్కార్ ఫోకస్
- జీపీ ఎన్నికలకు మరోసారి ఏర్పాట్లు
- ఓటరు తుది జాబితాకు షెడ్యూల్ విడుదల
- నేడు అభ్యంతరాల పరిష్కారం
- 23న ఓటర్ల జాబితా, కేంద్రాల ప్రకటన
- ఈనెలాఖరులోగా ఎన్నికల షెడ్యూల్
- అంతా సిద్ధం చేస్తున్న యంత్రాంగం
- సర్పంచ్ రాజకీయ ప్రస్థానంపై ఆశావహులు దృష్టి

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అడుగులు చకచకా పడుతున్నాయి. తొలుత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయానికి రాగా ఎన్నికల సంఘం ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఈనెల 23న జిల్లాలో ఓటర్ల తుది జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల వివరాలను విడుదల చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సిద్ధమవుతోంది. నవంబర్ 26 లేదా 27వ తేదీన పంచాయతీ ఎన్నికల నగారా మోగనుందని తెలుస్తోంది. మొత్తం మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ ఎన్నికలను చాలా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ స్పష్టం చేసింది. నెలలోగా పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసే వీలుంది. ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల్లో రెండుసార్లు ఓటరు జాబితా సవరణ చేపడుతున్నది. సెప్టెంబర్ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర హైకోర్టు ఆదేశాలిచ్చిన విషయం విదితమే. ఆ మేరకు ఆగస్టులో ఓటరు జాబితా సవరణ చేసి.. తుది జాబితా ప్రదర్శించింది. ఎన్నికల నిర్వహణకు నామినేషన్ల పర్వం కూడా మొదలైంది. కానీ, బీసీ రిజర్వేషన్ల అంశంపై కోర్టుకు వెళ్లడం.. రిజర్వేషన్ల అమలుకు విడుదల చేసిన జీవో నంబర్ 29ను రద్దు చేస్తూ కీలక తీర్పునివ్వడంతో ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. 2019, జనవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగగా, అదే ఏడాది ఫిబ్రవరి 2న పాలకవర్గాల బాధ్యతలు చేపట్టిన విషయం విధితమే. వీరి పదవీ కాలం 2024 ఫిబ్రవరి ఒకటిన ముగిసింది. కానీ ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన సాగుతున్నది. జీపీలను పట్టించుకునే వారు లేక సమస్యలు పేరుకుపోతున్నాయి. అభివృద్ధి కుంటుపడింది. 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం ఆగిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభత్వాల నిధులు గ్రామాలకు దక్కాలంటే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మరో వైపు.. పంచాయతీల్లో ఓటరు జాబితా మరోసారి సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) బుధవారం షెడ్యూల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. నవంబర్ 23వ తేదీ వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. 20వ తేదీన ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ చేయనుంది. 21వ తేదీన ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాలను పరిష్కరిస్తుంది. 23వ తేదీన ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని ఆదేశాలు జారీ చేసిన విషయం విధితమే. డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన వారోత్సవాలు జరుగుతాయి. ఆ తర్వాత ఈ ఎన్నికల నిర్వహించాలని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియపై రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తేనే.. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే గ్రామ పంచాయతీ ఎన్నికలపై రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల కానుండడంతో గ్రామాల్లో మళ్లీ ఎన్నికల సందడి నెలకొంది.



## రగ్బీ పోటీలకు బాల బాలికల జట్ల ఎంపిక

**నిర్మల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి అదిలాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రగ్బీ పోటీలను నిర్వహించి బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా నిర్మల్ జిల్లా డివైస్ ఓ శ్రీకాంత్ రెడ్డి, స్కూల్ గేమ్స్ సెక్రెటరీ రవీందర్ గౌడ్, టిజిపేట కార్యదర్శి వన్నెల భూమన్న విశిష్ట అతిథులుగా ఎస్‌టియు నిర్మల్ జిల్లా అధ్యక్షులు జె లక్ష్మణ్, లక్ష్మణ్, మరో అతిథిగా ప్రొఫెసర్ మురళి, కన్వీనర్ భూమేష్, సాఫ్ట్బాల్ కార్యదర్శి అన్నపూర్ణ ఆ లక్ష్మణ్ రగ్బీ అసోసియేషన్ అధ్యక్షులు దేవుల విజయ్ వ్యాయామ ఉపాధ్యాయులు అలహాస్ సంతోష్ సహదేవ్ అజయ్ తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ సెలెక్ట్ అయిన క్రీడాకారులు సిద్దిపేటలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీలలో పాల్గొంటారని చెప్పారు.

## వింత వ్యాధితో గొర్రెల మృతి



**కన్నెపల్లి, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఆనందపూర్ శివారులో ఆకస్మికంగా మృతి చెందిన 40 గొర్రెల యజమానులకు ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శంకర్ అన్నారు. గురువారం మృతి చెందిన గొర్రెలను పరిశీలించి మృతికి గల కారణాలను పశు వైద్యురాలు శ్వేతను అడిగి తెలుసుకున్నారు.

## లారీ బోల్తాపడి డ్రైవర్ మృతి

**ఇచ్చోడ, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి నాందేడ్‌కు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ మండలంలోని జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ షేక్ నీజార్(39) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రహ్లాద్, రాంకిషన్, షేక్ అహ్మద్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించగా ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో అన్యాయం

**జైనూర్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో ఆదివాసులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తున్నదని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనక యాదవరావ్ రోపించారు. జైనూర్‌లో గురువారం ఆయన మాట్లాడారు. శాన్వి సర్వీసెస్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ పేరుతో ఇటీవల విడుదలైన ఉద్యోగ ప్రకటనను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివా సులకు ఏ ఒక్క పోస్టులోనూ రిజర్వేషన్ కల్పించకుండా ఏకపక్షంగా ఇతరవర్గాలకు కేటాయించడం సమంజసం కాదన్నారు. నర్సింగ్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను ఆదివాసులతో భర్తీ చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు



వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు మడావి భీంరావ్, నాయకులు జగ్గేరావ్, భీంరావ్, చంపత్‌రావ్, తొడసం ధర్మరావ్, మడావి నాగ్నాథ్, ఆత్రం లక్ష్మణ్, ఆత్రం బలవంతరావ్, ఆత్రం చిన్ను తదితరులున్నారు.

## వరకట్నం కోసం వేధించి నలుగురిపై కేసు

**నెన్నెల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

వరకట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తా మామలతో పాటు బావపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. నెన్నెలకు చెందిన రణవీర్‌సింగ్ కుమార్తె నందినికి హైదరాబాద్‌కు చెందిన ఠాకూర్ దినేష్ సింగ్‌తో 2023 జూన్ 5న వివాహమైంది. దంపతులకు కుమారుడు ఉన్నాడు. పెళ్లి సమయంలో మూడు తులాల బంగారం, రూ. 1.50 లక్షలు కట్నంగా ఇవ్వాలని డిమాండ్ చేయగా బంగారంతో పాటు రూ.50 వేలు మాత్రమే ఇచ్చారు. మిగతా రూ.లక్ష తేవాలని భర్తతో పాటు అత్త కవిత, మామ రాం చందర్ సింగ్, బావ బిట్టేస్ సింగ్ మానసికంగా వేధించేవారని నందిని ఫిర్యాదులో పేర్కొంది. ఇంటర్ మాత్రమే చదివిన దినేష్ ఐటీ ఉద్యోగం చేస్తున్నట్లు లక్షల్లో జీతం ఉందని అబద్ధం చెప్పి మోసగించి పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

## గుండెపోటుతో రైతు మృతి

**వేమనపల్లి, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**



కోతకు వచ్చిన వరిపొలాన్ని అడవి పందుల భారి నుంచి కాపాడుకునేందుకు కాపలాగా వెళ్లిన రైతు గుండెపోటుతో పొలం వద్దే ప్రాణాలొదిలిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని జాజులపేటకు చెందిన చౌదరి మహేష్ (32) పదేళ్లుగా గ్రామంలో ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. సాగు భూమి లేకపోవడంతో ముక్కిడి గూడెంకు చెందిన ఓ రైతు వద్ద ఎకరం పొలం కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశాడు. ప్రస్తుతం పంట కోతకు రావడంతో అడవి పందులు దాడి చేస్తున్నాయి. దీంతో బుధవారం రాత్రి పంటకు రక్షణగా పొలం వద్ద పడుకునేందుకు వెళ్ళాడు. గురువారం తెల్ల వారుజామున మలవిసర్జనకు వెళ్లగా గుండెపోటుకు గురై అక్కడే కిందపడి ప్రాణాలొదిలాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవటంతో సోదరుడు శేఖర్ పొలం వద్దకు వెళ్లిచూడగా విగత జీవిగా పడి ఉన్నాడు. ఎడ్లబండి సాయంతో మృతదేహాన్ని ఇంటికి తరలించారు. సంఘటనలో మృతుని భార్య మమత, సోదరుడు స్పృహతప్పి పడిపోవడంతో ఆస్పత్రికి తరలిం చారు. మృతునికి తల్లిదండ్రులు గౌరక్క, ముత్తయ్య, కుమారులు అద్వైత్, హయాన్ని ఉన్నారు.

## రైతుపై ఎలుగుబంటి దాడి

**పెంబి, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

పెంబి మండలం పోచంపల్లి గ్రామ పంచాయతీలోని హీర్లపేటకు చెందిన రైతు బోడ శ్రీనివాస్‌పై గురువారం ఎలుగుబంటి దాడి చేసింది. పంట చేనుకు వెళ్తుండగా ఒక్కసారిగా దాడి చేయడంతో కాలుకు గాయాలయ్యాయి. పక్కనే ఉన్న చెట్టుపైకి ఎక్కి ప్రాణాలు రక్షించికున్నాడు. శ్రీనివాస్ కేకలు వేయడంతో స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని ఆయనను చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





## సిర్పూర్ (టి)లో పెద్దపులి సంచారం

**సిర్పూర్ (టి), నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని పలు ప్రాంతాల్లో పెద్దపులుల కదలికలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని మాలిని, ఇటిక్యాల పహాడ్ గ్రామాల సరిహద్దుల్లో పెద్దపులి సంచరిస్తోంది. గురువారం మాలిని అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. మాలిని ప్రాంతం నుంచి ఇటిక్యాల పహాడ్ గ్రామ పరిసరాలకు వెళ్లినట్లు నిర్ధారించారు. అయితే దుబ్బగూడ గ్రామ పరిసరాల్లో కూడా పెద్ద పులి సంచరించినట్లు స్థానికులు చెబుతుండగా, అటవీ శాఖ అధికారులు నిర్ధారించలేదు. సిర్పూర్ (టి)రేంజ్ పరిధిలోని మాలిని, ఇటిక్యాల పహాడ్ గ్రామ అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేంజ్ అధికారి ప్రవీణ్ కుమార్ సూచించారు.

## ఐదుగురు కలప స్మగర్ల బైండోవర్



**ఇచ్చోడ, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

సిరిచెల్మ టైగర్ జోన్ అటవీ ప్రాంతంలో అక్రమంగా చొరబడిన కేశవపట్నం గ్రామానికి చెందిన కలప స్మగ్లర్లు అలీం, ఆస్లాం, సిరాజ్, వసీం, ఫారూఖ్‌ను గురువారం తహసీల్దార్ జాదవ్ రమేశ్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ నెల 18న ఐదుగురు నిందితులు టైగర్ జోన్ అటవీ ప్రాంతానికి వెళ్లగా పట్టుకున్నట్లు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు. వారి వద్ద నుంచి 2 మోటర్ బైకులు, రెండు గొడ్డళ్లు, 2 బార్వాలు, 20 ఇనుప రంపాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**మంచిర్యాల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల, రవీంద్రఖని రైల్వేస్టేషన్ల మధ్య గురువారం రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతుడు తెలుపురంగు చొక్కా, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు.



## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**సిర్పూర్ (టి), నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. గురువారం సిర్పూర్ (టి) మండలంలోని రైతు వేదికలో 23 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ ఆడపిల్ల పెళ్లి కోసం ప్రభుత్వం లాంఛనంగా ఇస్తున్న ఈ మొత్తాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ నుండి మాకుడి వరకు డబల్ బీటీ రోడ్డు, అచ్చెల్లి నుండి ఆరేగూడ వరకు బీటీ రోడ్లు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కలిసి సిర్పూర్(టి) రైల్వే స్టేషన్‌కు సంబంధించి పలు అభివృద్ధి పనుల గురించి వివ రించానని,దక్షిణ్ ఎక్స్‌ప్రెస్, బల్లార్షా ఎక్స్‌ప్రెస్‌లకు సిర్పూర్ టౌన్‌లో అదనపు స్టాపేజీ, భాగ్యనగర్ ఎక్స్ ప్రెస్ సిర్పూర్ వరకు పొడిగించాలని కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రహీముద్దీన్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఆర్ఐ ప్రవీణ్, వేణు, సాయి పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులో అగ్ని ప్రమాదం

**మంచిర్యాల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** హాజీపూర్ మండలం గుడి పేట సమీపంలో కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంచిర్యాల నుంచి కోరుట్ల వెళ్తున్న బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులున్నారు. అదృష్టవశాత్తు అందరూ సురక్షితంగా బయటపడ్డారు. మంటలు వేగంగా వ్యాపించడంతో, కొందరు ప్రయాణికులు బస్సు అద్దాలు పగలగొట్టి బయటకు దూకారు.

## సాముహిక అత్యాచారం కేసులో ముగ్గురికి రిమాండ్

**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** మావల పీఎస్ పరిధిలో సాముహిక అత్యాచారం కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఎల్. జీవన్రెడ్డి తెలిపారు. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకాలోని పిప్పల్గాంకు చెందిన నిందితులు యోగేష్ జాదవ్(22), సూరజ్ జాదవ్(25), ఆదిలాబాద్‌కు చెందిన జాదవ్ నవీన్ (26) అనే ముగ్గురు వ్యక్తులు.. 15 ఏళ్ల బాలికను మభ్య పెట్టి కొన్నాళ్లుగా ఆమెపై అత్యాచారానికి పాల్పడుతున్నారు. బుధవారం బాలికను ఓ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశారని డీఎస్పీ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

## హాస్టళ్ల వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

**మంచిర్యాల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** జిల్లాలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సంక్షేమ హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వార్డెన్లు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్నారు

## కరెంట్ షాక్‌తో ఆవు మృతి

**ముథోల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** కరెంట్ షాక్‌తో ఆవు మృతి చెందిన ఘటన భైంసా మండలంలో చోటుచేసుకుంది. చింతలబోరి గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఆవు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైంది. తన వ్యవసాయ చేనులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆవు తగలడంతో కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు.

# వైద్యుడి నిర్లక్ష్యానికి బాలుడు బలి

- ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, బంధువులు
- ఆస్పత్రి అద్దాలు ధ్వంసం.. ఆందోళన



**మంచిర్యాల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** మంచిర్యాలలో విషాదం చోటు చేసుకుంది. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నాలుగు నెలల బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రి వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆసుపత్రి అద్దాలను ధ్వంసం చేసి ఆందోళనకు దిగారు. జగిత్యాల జిల్లాకు చెందిన పాలపు శేఖర్, సౌందర్య దంపతులకు కార్తీక్ (4) బాబు ఉన్నాడు. నాలుగు నెలల క్రితం మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్‌కు వచ్చారు. రెండు రోజుల క్రితం బాబుకు శ్వాసకు సంబంధించిన సమస్య రావడంతో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో ఉన్న రాఘవేంద్ర పిల్లల ఆసుపత్రికి తీసుకోవచ్చారు. ఆసుపత్రి వైద్యుడు బాబును పరిశీలించి ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని రెండు రోజుల పాటు చికిత్సను అందించారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి బాబుకు కార్డియక్ సమస్య రావడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా చికిత్స అందించే విషయంలో వైద్యుడు నిర్లక్ష్యం చేయడంతో బాబు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యుడు నిర్లక్ష్యం వలనే తమ చిన్నారి మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. తమ కుమారుడు మృతికి కారణమైన వైద్యుడు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రమోద్ రావు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని ఆసుపత్రి వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని బాధితలకు నచ్చజెప్పారు.

**చికిత్స సమయంలో కార్డియాక్ సమస్యతో మృతి**

**డాక్టర్ సతీష్ కుమార్**

ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యుడు సతీష్ కుమార్‌ను వివరణ కోరగా ఈనెల18న శ్వాస సమస్యతో చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చారని, తాను సరైన వైద్యం అందించినట్లు తెలిపారు. బుధవారం రాత్రి తల్లి బాబుకు పాలు పట్టిస్తున్న సమయంలో గుండెకు సంబంధించి హిడెన్ అనే సమస్య వచ్చిందని, వెంటనే ప్రథమ చికిత్సను అందించానని వివరించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం కరీంనగర్, హైదరాబాద్ కార్డియాలిజిస్ట్ వద్దకు వెళ్లాలని సూచించానని వెల్లడించారు. అక్కడికి వెళ్లకుండా ఇక్కడే ఆలస్యం చేయడంతో బాబు మృతి చెందాడని వైద్యుడని ఆయన వివరించారు. వైద్య సేవలందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయలేదన్నారు.

## ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



**మందమర్రి, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** మందమర్రి పట్టణంలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని గురువారం జాతీయ రహదారి అధికారులు, పట్టణ పోలీసుల సంయుక్తంగా యాపల్, కేకే2 ఏరియాలలోని సర్వీస్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు శాశ్వత పరిష్కారంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. యాపల్ ఏరియాను రోడ్డు ప్రమాదాలకు 'బ్లాక్ స్పాట్'గా గుర్తించిన పట్టణ పోలీసులు తమ వంతు కృషిగా జాతీయ రహదారి అధికారులతో సమన్వయంతో రోడ్డు భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాహనదారులు కూడా నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు.

## చేయి.. చేయి కలిపారు.. రోడ్డును బాగుచేసుకున్నారు..!

**తలమడుగు, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** ఎవరో వస్తారని.... ఏదో చేస్తారని... ఎదు రుచూడకుండా అక్కడి రైతులందరూ ఒక్కటై రోడ్డును బాగు చేయించుకున్నారు. తమ పంట పొలాలకు వెళ్లాలంటే గుట్టను ఎక్కుతూ... రాళ్లు రప్పలు దాటుతూ పడుతున్న ఇబ్బందులను వారే పరిష్కరించుకున్నారు. రాళ్లు రప్పల తో అధ్వాన్నంగా ఉన్న రోడ్డును రైతులే బాగు చేసుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి కొంత దూరంలోని గుట్టపై పలువురు రైతులకు సంబంధించిన దాదాపు 1,500 ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. దీంతో అక్కడి రైతులు ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం సాగు చేస్తూ రాళ్ళల్లో రత్నాలు పండిస్తున్నారు. ఐతే ఆరుగాలం కష్టపడి కూలీల కొరతతో పంట సాగుచేయడం, పంటను వన్య ప్రాణుల నుండి సంరక్షించుకుంటూ వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్నారు. కాగా పంట పొలాలకు వెళ్లే రహదారిలో పెద్దపెద్ద బండరాళ్లతో నడవడానికి ప్రతి ఏటా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గుట్ట దారినీ బాగు చేసుకోవడానికి రైతులంతా ఏకమై శ్రమదానం చేసుకుంటున్నారు. అయితే ఈ సంవత్సరం పొలం బాట కింద గుట్ట దారికి



ప్రభుత్వం రూ .7 లక్షల రూపాయలు మంజూరు చేసిందని, గత నెల రోజులుగా పనులు చేపడతారని ఎదురుచూస్తున్న పనులు చేపట్టకపోవడంతో రైతులు తల కొంత నగదు జమ చేసి జెసిబి ద్వారా పనులు చేపడుతున్నామని రైతు వెంకన్న వాపోయారు. పలుమార్లు ఎడ్ల బండ్లతో రైతులకు ప్రమాదాలు జరిగాయని, ప్రతి ఏడు అధికారులకు నాయకులకు విన్నవించిన ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా తాము పడుతున్న శ్రమను ఎవరు గుర్తించడం లేదని, దారి బాగోలేకపోతే వ్యవసాయాలు వదిలేయాల్సి పరిస్థితి వచ్చిందని అసహనం వ్యక్తం చేశారు.



## విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి

**షెడ్యూల్ కులాల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు**

**లక్షెట్టిపేట, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు అన్ని వసతులు సక్ర మంగా కల్పించాలని షెడ్యూల్ కులాల అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం సాయంత్రం అయన పట్టణంలోని పలు వసతిగృహాలను సంబంధిత అధికారులతో కలిసి ఆకస్మికంగా పరిశీ లించారు. వసతిగృహాల్లో విద్యార్థులకు హెచ్‌డబ్లువోలు అందజేస్తున్న భోజనంతో పాటు ఇతర సౌకర్యాలపై ఆరా తీసారు. అంతే కాకుండా కిచెన్, స్టోర్ రూం, వా ష్‌రూమ్స్, డైనింగ్ హాల్స్‌లను పరిశీలించారు. వి ద్యార్థుల రోజు వారి హాజరు పరిశీలించిన ఆయన ప్రతీ రోజు అటెండెన్స్‌ని ఆన్‌లైన్‌లో క్రమం తప్పకుండా నమోదు చేయాలని వార్డెన్స్‌ని ఆదేశించారు. విద్యార్థులు ఇప్పటి వరకు నేర్చుకున్న పాఠాలను అడిగి తెలుసుకు న్నారు, అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా వసతిగృహాలను తనిఖీ చేస్తామన్నారు. విద్యార్థులకు ప్రతీ రోజు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనంతో పాటు అల్పాహారం అందించాలని అవి కూడా నాణ్యతతో ఉండాలన్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఇబ్బందులు కలు గకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు కావాల్సిన అవసరాలు వస తుల ఇండెంట్ తెలియజేయాలని అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట ఎఎస్‌డ బ్లు వో దర్మానంద్‌గౌడ్, ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చాతరాజు దుర్గాప్రసాద్ ఉన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ - వివిధ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం

**మంచిర్యాల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి పోలీస్, రెవెన్యూ, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ పై పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు సెల్లార్ స్థలాలు కేవలం పార్కింగ్ కోసం మాత్రమే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు రహదారుల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపి వేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచనలు ఏర్పాటు చేయాలని సూచించారు. కూరగాయల వ్యాపారులు రోడ్లపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులు, డ్రైవర్లు, ప్రజలను రోడ్డు భద్రత నియమాలపై చైతన్య పరచాలని తెలిపారు. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను



గుర్తించి ప్రమాదాల నివారణ దిశగా జాగ్రత్త సూచికలు, బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, కల్వర్టుల వద్ద షోల్డర్స్, రేడియంతో సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను గోశాలలకు తరలించేందుకు మున్సిపల్ అధికారులు పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను

# వేగవంతం చేయాలి

**మందమర్రి, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ డిఈ మునీందర్ సూచించారు. మండలంలోని చిర్రకుంట గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను గురువారం మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రామచందర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి దారులు ఇంటి నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ప్రభుత్వం అందించే బిల్లులు పొంది ఇంటి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాలయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



## కుమ్రంభీం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాలకు వివిధ అనారోగ్య సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఏరియా ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ఒప్పంద పద్ధతిన వైద్యులుగా పని చేయుటకు నిర్వహించిన ఇంటర్వ్యూ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, తెలంగాణ వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వ యకర్త అవినాష్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు అనిల్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒప్పంద పద్ధతిన ఎంపికైన వైద్యులు ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. భౌగోళికంగా జిల్లా పరిధి ఎక్కువగా ఉన్నందున మారుమూల ప్రాంతాల లోని ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అందించాలని, ప్రజలతో మ ర్యాదగా మెలుగుతూ, సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



### ఖేలో ఇండియా పోటీల

# పోస్టర్ల ఆవిష్కరణ

**నిర్మల్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రేపటి నుంచి జిల్లాలో నిర్వహించబోయే బాలికల అండర్ 14, అండర్ 16 ఖేలో ఇండియా ఖేలో ఇండియా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు రేపటి నుంచి నిర్వహించనున్నారు. ఈ ఎంపిక పోటీలకు సంబంధించి గోడప్రతులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం సాయంత్రం తన ఛాంబర్‌లో విడుదల చేశారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల్లో నైపుణ్యాలు దాగి ఉన్నాయని, ఇటువంటి పోటీల ద్వారా వాటిని వెలికి తీయాలని అన్నారు. ఎంపిక పోటీలు పగడ్బందీగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ ఎంపిక పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ శ్యాముల్, ఎస్జిఎఫ్ సెక్రటరీ రవీందర్, గిరిప్రసాద్ ఉన్నారు.

# జీసీసీ ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలి

**ఉట్నూర్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** జీసీసీ అభివృద్ధికి ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని ఐటీడీఏ ఇంచార్జ్ పీఓ యువరాజ్ మర్మట్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐటీడీఏ పీఓ ఛాంబర్‌లో పీఓ యువరాజ్ మర్మట్ జీసీసీపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జీసీసీ ఆదాయ వనరులపై, చేపడుతున్న కార్యక్రమలపై పీఓ వివరాలు అడిగి తెలుసుకున్నారు. జీసీసీ పరిదిలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ల ఆదాయ వ్యయాలపై స మీక్ష చేశారు. అనవసర ఖర్చులు తగ్గించుకొని, లాభాల బాటలో నడిపించేల చూడాలనీ పీఓ ఆదేశించారు. బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పెట్రోల్ బంక్‌లలో అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, అవసరమైన చోట సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవాల న్నారు. జీసీసీకి సంబంధించిన ఆస్తులను కా పాడాలని, ఎక్కడా కూడా కబ్జా అవ్వకుండా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. గిరిజన పాఠశాలలకు సరఫరా చేసే వివిధ రకాల ఆహార పదార్థాలలో నాణ్యతా ప్రమా ణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డివి జనల్ మేనేజర్ సందీప్ కుమార్, మేనేజర్లు సంతోష్ కుమార్, గులాబ్ సింగ్, ఇస్తారి, మనోహర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# స్థానిక సంస్థ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

## రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని






**మంచిర్యాల, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డి.జి.పి. శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు - కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రతల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలను 3 విడతలలో నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. 2011 ఎన్నికల జాబితా ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, 2024 ఎస్ ఈఈఈపిసి సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 306 గ్రామపంచాయతీలు, 2 వేల 680 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణ కొరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. నిబంధనల ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియ చేపడతామని, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే సిబ్బంది, ఎన్నికల సామాగ్రిని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. భాస్కర్, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.






# గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి కృషి

**■ గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ప్రతి ఒక్క యువత స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ధారించుకొని ఉన్నతంగా ఎదగాలని, దీని కోసం గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్యతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా ప్రముఖ రచయిత సామల సదాశివ మాస్టర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చదవడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సాధించవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు గ్రూప్ స్టడీ చేయడం వల్ల పోటీ పరీక్షల్లో విజయం సులభతరం అవుతుందని సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలోని రీడింగ్ రూమ్ పనులను వేగవంతం చేసి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఐటిడిఏ ఉట్నూర్‌లో గ్రంథాలయ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, అలాగే జిల్లా కేంద్రంలో నూతన గ్రంథాలయ భవనం నిర్మాణం కోసం కూడా ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు. తాంసి, బీంపూర్, లక్ష్మీపూర్ మండలాల్లో ఇప్పటికే పబ్లిక్ రీడింగ్ రూమ్లను ప్రారంభించడం జరిగిందని చెప్పారు. 21 నెలలుగా ఆదిలాబాద్ జిల్లాలో పని చేస్తున్నానని, ఈ జిల్లా తనకు గోల్డెన్ మూమెంట్‌ను అందించిందని భావోద్వేగపూరితంగా తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ... తాను కూడా ఇక్కడే గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యానని గుర్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రికి రేవంత్ రెడ్డికి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక అభిమానం ఉందని, జిల్లా గ్రంథాలయం అభివృద్ధికి కొత్త ప్రతిపాదనలు పంపితే నూతన భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందించి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బందిని నియమించాలి

**ఉట్నూర్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ఉట్నూర్ మండలంలోని పులిమడుగు గ్రామంతో పాటు ఆంధోలి గ్రామంలో కొన్ని సంవత్సరాల నుండి అంగన్వాడీలు లేక పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణీ రాజేశ్ పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో పీవో యువరాజ్ మర్మాట్‌ను కలసి వినతి పత్రం అందజేసి, సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణీ రాజేశ్ మాట్లాడుతూ.గత సంవత్సరం పులిమడుగు గ్రామంలోని అంగన్వాడీ ప్రమోషన్‌పై ఇచ్చోడకు వెళ్ళారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు అంగన్వాడీ టీచర్‌ను నియమించకపోవడం శోచనీయమన్నారు. అదే విధంగా ఆంధోలి గ్రామంలో అంగన్వాడీ లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రం నిర్వహణకు ఆయా కూడా లేకపోవడం వల్ల కేంద్రానికి రోజు తాళం వేసి ఉంటుందన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ కేంద్రాలలో సిబ్బందిని నియమించి, పిల్లలకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉట్నూర్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బాబా శ్యాం,నాయకులు జైచంద్ర, నరేశ్, బాలాజీ, కోటేశ్, సాజిద్, సోహెల్, శివ పాల్గొన్నారు.

## నర్సింగ్ కళాశాలలో ఆదివాసీలకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఉద్యోగల నోటిఫికేషన్ రద్దు చేసి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగా లను స్థానిక ఆదివాసీలకు అవకాశం కల్పించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవవిజయ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ను కలిసి తుడుందెబ్బ నాయకులు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ప్రకటించిన పోస్టులను రద్దు చేసి. ఆదివాసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# కేంద్రం దృష్టికి సోయా రైతుల సమస్యలు

**■ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రికి జిల్లా బీజేపీ ఎమ్మెల్యేల వినతి**



**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అతి వర్షాల వల్ల సోయా పంట పూర్తిగా రంగు మారడంతో కేంద్ర సంస్థలు కొనుగోలు చేయడం లేదని బీజేపీ ఎమ్మెల్యే లు కేంద్ర వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రిని న్యూ ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి రైతుల పక్షాన వినతి పత్రాన్ని అందజేశారు. కేంద్ర సంస్థలు రంగుమారిన సోయా పంటను కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్న విషయాన్ని ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సహజ విపత్తు రైతుల నియంత్రణలో లేని విషయం కాగా, చిన్న, సన్న కారు రైతులు భారీ ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. ఆదిలా బాద్ జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో రైతులకు ఇతర జీవనోపాధి మార్గాలు లేని పరిస్థితిని వివరించారు. ఈ సీజన్కు మాత్రమే నిబంధనల్లో ప్రత్యేక సడలింపు ఇచ్చి, రంగు మారిన సోయాను వెంటనే కొనుగోలు చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని మంత్రిని కోరారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ ఈ అంశాన్ని అవగాహన చేసుకుని, రైతుల బాధను దృష్టిలో ఉంచుకుని సానుకూలంగా స్పందించారనీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి, అవసరమైన సడలింపు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు. రైతు బాధలు తీర్చడమే ప్రభుత్వ ధ్యేయంమని, ఆదిలాబాద్ రైతుల సమస్యను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదిలాబాద్ జిల్లా సోయా రైతులు భారీ ఉపశమనం పొందనున్నారు. రైతుల పక్షాన కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడుకోవచ్చు

**అడిషనల్ డీఎంహెచ్ఓ కుడిమేత మనోహర్**



**ఉట్నూర్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

మనిషికి గుండె పోటు వస్తే సీపీఅర్ చేసి ప్రాణాలను కాపాడుకోవచ్చ అడిషనల్ డీఎంహెచ్ఓ కుడిమేత మనోహర్ పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని పాటగూడ గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు సీపీఆర్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్ఓ కుడిమేత మనోహర్ మాట్లాడారు.ఇటీవల గుండెపోటుతో మరణాల సంఖ్య పెరుగుతుందన్నారు.జీవన శైలిలో మార్పుల కారణంగా కొత్త రోగాలు పుట్టుకొస్తున్నాయన్నారు. ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదం జరిగితే మనిషికి సీపీఅర్ చేస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. ప్రతి రోజు వ్యాయామం చేయడంతో పాటు మొబైల్ ఫోన్, ల్యాప్ టాప్ వంటి పరికరాలను తక్కువగా వాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు పూజిత, ప్రిన్సిపాల్ స్వరూప్ గౌరవ్, హెచ్ఈవో నాందేవ్, సూపర్వైజర్ రాథోడ్ జలంధర్,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు క్రీడలను ఒక ప్రొఫెషన్‌గా భావిస్తేనే రాణిస్తారని, అందుకు తల్లిదండ్రుల సహకారం కూడా అవసరమని డీడీ అంబాజీ అన్నారు. స్థానిక కేబీత కాంప్లెక్స్‌లోని క్రీడా మైదానంలో జోనల్ స్థాయి బాలుర ఖో–ఖో పోటీలను ప్రారంభించారు.

## కొనుగోళ్లలో కొర్రీలతో రైతుల పరేషాన్

**ఆదిలాబాద్, నవంబర్ 20 (ప్రభాత సమాచారం)**

పంట కొనుగోలులో షరతులు, నిబంధనలు పెట్టడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రైతులు ఏకతా టిపై వచ్చి పోరాడాలన్నారు. నేడు భోరజ్ వద్ద మహా ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఇటీవల కేటీఆర్ పర్యటనపై స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు న్యాయం చేయని పక్షంలో మరింత ఉధృతంగా పోరాటలు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు నర్సింగ్ రావు, దేవన్న, పోచ్చన్న, జగదీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.